ఈనాడు
అమరావతి
కృష్ణా
గురువారం అక్టోబరు 24, 2024

మురిసిన భవిత



మెరిసిన యువత



అమరపురి.. సృజన సిరి..



ఘనంగా రెండు రోజుల డ్రోన్ సమ్మిట్

ఆశ్చర్యపరిచిన ఆధునిక, సాంకేతిక ప్రదర్శనలు

ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి

మంగళగిరిలో రెండో రోజు ప్రదర్శనకు ఉంచిన ఆధునిక డ్రోన్లను చూసి విద్యార్థులు.. గొప్ప అనుభూతికి లోనయ్యారు. తమకు ఇప్పటివరకూ వీటి గురించి ఇంత అవగాహన లేదని.. తొలిసారి ఇలాంటివి చూస్తున్నామని తెలిపారు. తాము కూడా పెద్దయ్యాక డ్రోన్లను తయారుచేస్తామని విద్యార్థులు ఆనందంగా చెప్పారు. ఇవి చూసి ఎంతో స్ఫూర్తి పొందామని, భవిష్యత్తులో డ్రోన్ల విప్లవం రానుందని.. ఇవన్నీ ప్రత్యేక నిదర్శనమని ఇంజినీరింగ్ విద్యార్థులు పేర్కొన్నారు. తాము ఇప్పటికే పొలాల్లో డ్రోన్లతో పురుగు మందులను పిచికారీ చేయిస్తున్నట్లు కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, మంగళగిరి, గుంటూరు ప్రాంతాల రైతులు ఆనందంగా తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాయం మరింత పెరిగితే.. రైతులకు ఎంతో ప్రయోజనకరమన్నారు.


రైతన్నకు తోడుగా.. విహార్

ఐఐటీ మద్రాసు విద్యార్థులు, అధ్యాపకుల సహాయంతో 'విహార్' పేరుతో డ్రోన్‌ను తయారు చేశారు. ఐఐటీ ప్రాంగణంలోనే స్టార్టప్ కంపెనీ పెట్టారు. ఈ డ్రోన్‌ను క్రిమిసంహారక మందులు, విత్తనాలు చల్లడానికి వాడవచ్చు. డ్రోన్ కింద అమర్చిన డబ్బాలో మందులను ఉంచి.. పిచికారీ చేయొచ్చు. రైతులు సులభంగా విత్తనాలను కూడా పొలాల్లో చల్లుకోవచ్చు. 30 కిలోల బరువు ఉండే ఈ డ్రోన్‌కు.. 10 లీటర్ల ద్రావణం ఒకేసారి పైకి తీసుకెళ్లి పిచికారీ చేసే సత్తా ఉంది. రెండు గంటల్లో 30 ఎకరాలకు పురుగుమందు పిచికారీ చేయగలదు. 100 అడుగుల ఎత్తు ఎగురుతుంది. తమ డ్రోన్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నుంచి టైప్ సర్టిఫికేషన్ ఉందని సంస్థకు చెందిన విఘ్నేశ్ వెల్లడించారు.



విహార్ డ్రోన్

ఈ డ్రోన్లు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది..



నేను 12 ఎకరాల్లో వరి, మినుము పండిస్తున్నా. ఇటీవల డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయించా. పంపు సెట్లతో కొడితే.. రోజులు పడుతుంది. పనివారూ దొరకడం లేదు. సొంతంగా డ్రోన్ కొంటే.. నాతోపాటు మా ఊరి రైతులకూ ఉపకరిస్తుందనే ఉద్దేశంతో చూసేందుకు ఇక్కడికి వచ్చా. పెట్రోలు, బ్యాటరీతో ఎక్కువ సమయం ఎగిరే డ్రోన్‌ను కొంటా. ఈ డ్రోన్లను చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది.

– వి.నర్సింగరావు, రైతు, గుడివాడ



అమరావతి డ్రోన్ సమ్మిట్ చూసేందుకు విజయవాడ, గుంటూరు సహా చుట్టుపక్కల ప్రాంతాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల రైతులు, ప్రజలు భారీగా విచ్చేసి డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ కృష్ణా తీరంలో తొలి రోజు నిర్వహించిన.. 5,500 డ్రోన్ల ప్రదర్శన చూపరులను కట్టిపడేసింది. రెండో రోజు డ్రోన్ల సాంకేతికత, సమాజ అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశాలపై.. మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్‌లో నిర్వహించిన.. సమావేశాల్లో నిపుణులు పాల్గొని.. అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన.. సమ్మిట్‌లో దేశవ్యాప్త సాంకేతిక నిపుణులు వచ్చి తాము రూపొందించిన ఆధునిక డ్రోన్లను ప్రదర్శించి.. ఔరా అనిపించారు.

సర్వైలెన్స్, మ్యాపింగ్‌కు.. సిగ్మా25



'సిగ్మా-25' డ్రోన్ అందరినీ ఆకర్షిస్తోంది. సర్వైలెన్స్, మ్యాపింగ్ సహా పలు అవసరాలకు దీనిని వాడొచ్చు. ఇన్‌డ్రోన్స్ సంస్థ రూపొందించిన ఈ డ్రోన్ అత్యంత తేలికైంది. కేవలం 3.5 కిలోల కంటే తక్కువ బరువు ఉంటుంది. 50 నిమిషాల్లో నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని పక్కాగా సర్వే చేస్తుంది. రైల్వే ట్రాక్, రహదారులు, వంతెనలు, ఆయిల్, గ్యాస్ రిఫైనరీలు, వ్యవసాయం, గనులు, విపత్తులు, టెలీకమ్యూనికేషన్, నిర్మాణం, స్మార్ట్ సిటీల నిర్వహణ వంటి అన్ని అవసరాలకూ వాడవచ్చు. ఈ డ్రోన్‌లో పగలు, రాత్రీ అత్యంత నాణ్యమైన వీడియోలను రికార్డుచేసే అత్యాధునిక కెమెరా అమర్చారు. బహిరంగ సభలు, ఉత్సవాల నిర్వహణకూ వాడవచ్చు.

రైతులకు, గిరిజనులకు భరోసా...





పెనమలూరు కుర్రాడు శామ్యూల్ ప్రభుత్వ యంత్రాంగానికి ఉపకరించే డ్రోన్ రూపొందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చదివి స్వీడన్‌లో కంట్రోల్ సిస్టమ్స్ ఇంజినీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం స్వదేశానికి వచ్చేసి.. విజయవాడ శివార్లలో డ్రోన్‌హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నెలకొల్పారు. రెండు రకాల డ్రోన్లను రూపొందించారు. ఒకటి అడవులు, కొండగుట్టల్లో ఉండే తండాల్లోని వారికి అత్యంత తేలికగా సరకులు, మందులు సహా ఏ అవసరం ఉన్నా తీసుకెళ్లి ఇచ్చే డ్రోన్. మరొకటి... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఆటోమేటిక్ డ్రోన్. సాధారణంగా పొలానికి పురుగు పడితే.. మొత్తం పంటకు పిచికారీ చేస్తారు. కానీ.. ఎక్కడ పురుగు పట్టిందో ఆ ప్రదేశాన్నే పక్కాగా ఆధునిక కెమెరా, ఏఐ ద్వారా గుర్తించి.. మందును సరిగ్గా అక్కడే ఈ డ్రోన్ పిచికారీ చేస్తుంది. తద్వారా పురుగు మందు వినియోగం సగానికి తగ్గించొచ్చు. ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ల సహకారంతో దీనిని రూపొందించారు.

సాగులో సగం ఖర్చు తగ్గుతోంది..



20 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. నాలుగేళ్లుగా పురుగు మందులు పిచికారీ చేయిస్తున్నా. సాధారణంగా ఇద్దరు మనుషులు రెండు రోజుల్లో 20 ఎకరాలకు మందులు జల్లుతున్నారు. ఒకరికి రోజుకు రూ.500 చొప్పున రూ.2 వేలు ఖర్చు. అదే డ్రోన్‌తో 5 గంటల్లో పని పూర్తయి.. రూ.వెయ్యి వెచ్చిస్తే చాలు. పైగా డ్రోన్‌తో మందుల పిచికారీ చేస్తే వృథా తగ్గుతోంది.

- ఎన్. వెంకటేశ్వరరావు, రైతు, తాడేపల్లి



విద్యార్థికి విజ్ఞానం



డ్రోన్ సమ్మిట్ విజయవంతంగా నడిపించిన బృందాన్ని అభినందిస్తున్న ఉన్నతాధికారులు

ఇంతికి దీపం.. ఇంటికి శుభం

ఈనాడు – అమరావతి

- 10 లక్షల కుటుంబాలకు మేలు
- దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు
- ఏడాదికి రూ.250 కోట్ల మేర లబ్ధి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్-6 పథకాల్లో తొలి పథకాన్ని ప్రారంభించనుంది. ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించే ఏర్పాట్లు చేసింది. వచ్చే దీపావళి నుంచి ఈ పథకం ప్రారంభం కానుంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో దాదాపు 10 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని అంచనా. ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతో ఒక కుటుంబానికి దాదాపు రూ.2,500 చొప్పున.. రూ.250 కోట్లు ప్రభుత్వం భరించాల్సి ఉంది. దీనిపై విధివిధానాలు రావాల్సి ఉందని జిల్లా అధికారులు చెబుతున్నారు.

ఇదీ లెక్క...



ఉమ్మడి జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్లు దాదాపు 12.61 లక్షలు ఉన్నాయి. వీటిలో బీపీఎల్.. ఏపీఎల్ కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ పథకాన్ని బీపీఎల్ కుటుంబాలకు వర్తింపజేసే వీలుంది. ఇప్పటికే కేంద్రం సంపన్న వర్గాలకు ఇచ్చే గ్యాస్ సబ్సిడీ వదులుకోవాలని సూచిస్తోంది. ఈనేపథ్యంలో ఉచిత సిలిండర్ బీపీఎల్ కుటుంబాలకే వర్తింపజేసే వీలుంది. ముందుగా మొత్తం ధర చెల్లించాలనీ.. తర్వాత లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో సిలిండర్ ధర జమ కానుంది. ప్రస్తుతం వంట గ్యాస్ 14 కేజీల సిలిండర్ ధర రూ.827.50. దీనిలో కేంద్ర ప్రభుత్వ రాయితీ నామమాత్రమే.. మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. ఆ మేరకు జిల్లాలో తెల్లకార్డులు ఉన్న వారికే వర్తించవచ్చు.

రేషన్ కార్డుల వివరాలు

	ఎన్టీఆర్	కృష్ణా
తెల్లకార్డులు	5,89,011	5,33,288
వంటగ్యాస్ కనెక్షన్లు (అన్ని రకాలు)	6,55,000	6,06,423
సిలిండర్ల వినియోగం (సగటున, అన్ని కంపెనీలు)	3.50లక్షలు	3.25లక్షలు

తెల్లకార్డుదారులకు ఊరట...

గ్రామీణంలో కార్డులు ఉన్న వారిలో కొందరికి వంట గ్యాస్ కనెక్షన్లు లేవు. డీఆర్‌డీఏ ద్వారా గతంలో తెదేపా ప్రభుత్వం దీపం పథకం కింద కనెక్షన్లు ఇచ్చింది. వీటి అన్నింటికి ఉచిత సిలిండర్ పథకం వర్తింపజేస్తారు. బియ్యం కార్డులు ఉన్న వారు.. ఏటా నాలుగు సిలిండర్లు గరిష్ఠంగా వినియోగిస్తున్నట్లు అంచనా. అంతకు మించి వినియోగం లేదు. ప్రభుత్వం మూడు సిలిండర్లు మాత్రమే ఉచితంగా అందిస్తుంది. ఇండేన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ కంపెనీలు సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. ఇవికాక విజయవాడ నగరంలో అపార్టుమెంట్లకు.. కొన్ని కంపెనీలు నేరుగా వంట గ్యాస్ పంపిణీ చేస్తున్నాయి. వీటికి సబ్సిడీ సిలిండర్లు ఉండకపోవచ్చని అంచనా.

వివరాలు సేకరించని అధికారులు..!

సూపర్-6 పథకాల అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంటే.. కనీసం ఆ వివరాలను కూడా సేకరించని స్థితిలో పౌరసరఫరాల శాఖ (ప్రజాపంపిణీ వ్యవస్థ) అధికారులు ఉన్నారు. తమ పరిధిలో ఉన్న బీపీఎల్ కుటుంబాల వంట గ్యాస్ కనెక్షన్ల వివరాలు అందుబాటులో లేవు. దీంతో మల్లగుల్లాలు పడుతున్నారు. ఆయిల్ కంపెనీల ద్వారా సేకరించాలని చెబుతున్నారు. తమకు ఎలాంటి మార్గదర్శకాలు అందలేదనీ.. తమను ప్రభుత్వం వివరాలు అడగలేదని కృష్ణా జిల్లా డీఎస్వో పార్వతి 'ఈనాడు'తో చెప్పారు. మార్గదర్శకాలు అందాల్సి ఉందని ఎన్టీఆర్ డీఎస్వో పాపారావు తెలిపారు.

విద్యుత్తు బస్సులకు ప్రతిపాదనలు

విజయవాడకు 100, అమరావతికి 50

కేంద్రానికి ఆర్టీసీ అధికారుల ప్రతిపాదన



ఈనాడు - అమరావతి: పర్యావరణ హితం కోరుతూ సంప్రదాయ ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రజారవాణా వ్యవస్థలో విద్యుత్తు బస్సులను ప్రవేశపెట్టేందుకు దృష్టి సారించింది. 'పీఎం ఈ - బస్ సేవ' పథకం కింద విద్యుత్తు బస్సుల కోసం కేంద్రానికి ఆర్టీసీ ప్రతిపాదనలు సమర్పించింది. ఇటీవల ఆర్టీసీ అధికారులు దిల్లీ వెళ్లి కేంద్రానికి అందజేశారు. దేశీయంగా వివిధ నగరాల్లో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో ప్రజా రవాణా అవసరాల కోసం ఈ బస్సులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఇందుకు దేశీయంగా టెండర్లు పిలిచాక జనాభా ప్రాతిపదికన విజయవాడ నగరానికి వంద బస్సులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్తుతో నడిచే బస్సుల నిర్వహణ వ్యయం తక్కువే. ఒకసారి ఛార్జింగ్ చేస్తే వందకు పైగా కి.మీ. నడుస్తాయి. విజయవాడ నగరంలో కార్బన్ మోనాక్సైడ్ ఆందోళనకర స్థాయిలో నమోదవుతోంది. ప్రస్తుతం సిటీ సర్వీసుల్లో చాలా బస్సులు ఎక్కువ కి.మీ. తిరిగాయి. ఇవి కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్తు బస్సులు వస్తే వాయు కాలుష్యం తగ్గే వీలుంది.

అన్నీ విద్యాధరపురం డిపోకే !

గతంతో పోలిస్తే.. తాజా ప్రతిపాదనల్లో డిపోలను మార్చారు. విద్యాధరపురం, గవర్నర్‌పేట-2 డిపోలకు విద్యుత్తు బస్సులను ప్రతిపాదించారు. వీటిని మార్చి అన్నింటినీ విద్యాధరపురం డిపో కోసమే ప్రతిపాదించారు. అక్కడే బస్సుల ఛార్జింగ్ కోసం 6000 కేవీఏ సామర్థ్యంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను నగరంలో 15 రూట్లలో వంద బస్సులను తిప్పనున్నారు. కబేళా - గవర్నమెంట్ ప్రెస్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ - ఆటోనగర్, కాళేశ్వరరావు మార్కెట్ - ఆటోనగర్, హెచ్‌బీ కాలనీ - ఆటోనగర్, రైల్వేస్టేషన్ - ఆటోనగర్, హెచ్‌బీ కాలనీ - పెనమలూరు, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ - తాడిగడప, ఎన్ఎస్‌బీ నగర్ - ఆటోనగర్, సిటీబస్ పోర్టు - మైలవరం, సిటీ బస్‌పోర్టు - విస్సన్నపేట, కేఆర్ మార్కెట్ - పామర్రు, పీఎన్‌బీఎస్ - విస్సన్నపేట మార్గాల్లో వీటిని నడపాలని ప్రతిపాదించారు.

రాజధానిలోని పలు రూట్లలో..

రాజధాని పునర్నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో విద్యుత్తు బస్సులను అమరావతికి కూడా ప్రతిపాదించారు. ఏడు రూట్లలో తిప్పేందుకు 50 బస్సులు అవసరమని తేల్చారు. విజయవాడ నగరంలో డిపోల నుంచి ప్రస్తుతం తిరుగుతున్నాయి. విద్యుత్తు బస్సులన్నీ గుంటూరు జిల్లా మంగళగిరి డిపోకు బదిలీ చేస్తారు. మంగళగిరి - గుంటూరు, మంగళగిరి - సచివాలయం, మంగళగిరి - హైకోర్టు, పీఎన్‌బీఎస్ - అమరావతి, విజయవాడ రైల్వేస్టేషన్ - ఎయిమ్స్, పీఎన్‌బీఎస్ - హైకోర్టు, పీఎన్‌బీఎస్ - సచివాలయం రూట్లో సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు బస్సులను తిప్పేందుకు అధికారులు యోచిస్తున్నారు.



సీతానగరం వైపు నదిలోకి కుంగిపోతున్న రక్షణ గోడ



కూలిన రక్షణ గోడ వద్ద ముళ్లకంపలు అడ్డుగా పెట్టారిలా..

కూలిపోతోంది.. కదలి రండి

ప్రకాశం బ్యారేజీ చెంతన కృష్ణానది వెంబడి రక్షణ గోడ దెబ్బతినడంతో సందర్శకులు భయాందోళనలకు గురవుతున్నారు. నదీ ప్రవాహాన్ని తిలకించేందుకు నిత్యం సందర్శకులు తరలివస్తుంటారు. గోడ వెంబడి కాసేపు సేద తీరి సెల్ఫీలతో సందడి చేస్తుంటారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా సీతానగరం వైపు ఉన్న రక్షణ గోడ నదిలోకి కుంగిపోతోంది. కొంత మేర కూలిపోగా.. జలవనరులశాఖ అధికారులు తాత్కాలికంగా ముళ్ల కంప అడ్డుగా వేసి వదిలేశారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా సందర్శకులు నదిలో పడిపోయే అవకాశం లేకపోలేదు. దీనికి తోడు బ్యారేజీ 39వ పిల్లరు వద్ద పాదచారుల బాట వెంబడి రెయిలింగ్ వంగి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– ఈనాడు అమరావతి, న్యూస్‌టుడే తాడేపల్లి



బ్యారేజీ మధ్యలో రెయిలింగ్ లోపలకు ఒరిగి..

విభాగాల వారీగా న్యాక్ బృందం పరిశీలన

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జాతీయ అసెస్‌మెంట్, అక్రిడేషన్ 'కమిటీ(న్యాక్) సభ్యులు బుధవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, రెక్టార్ బసవేశ్వరరావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించగా, ఎన్‌సీసీ విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. కమిటీ ఛైర్మన్ ఎన్‌కే లోక్‌నాథ్‌తో పాటు సభ్యులు రిచా మదన్, సంజీవ్ కుమార్‌శర్మ, ప్రదీప్ డియోట, ప్రకాష్‌చంద్రప్రదాన్, సుప్రితమ్‌రాయ్, హేమంత్‌దేశ్‌ముఖ్‌లు విశ్వవిద్యాలయంలో పర్యటించారు. తొలుత ఉపకులపతి పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా విశ్వవిద్యాలయం గురించి వివరించారు. అనంతరం ఇంటర్నల్ క్వాలిటీ కంట్రోల్ సెల్‌తో పాటు ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు ఆయా విభాగాల అధిపతులు తమ పరిధిలోని వాటిని అంశాల వారీగా వివరించారు. అయితే ఇంటర్నల్ క్వాలిటీ కంట్రోల్ సెల్ ఇచ్చిన నివేదికపై న్యాక్ బృందం అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వారికి పంపిన నివేదిక, క్షేత్రస్థాయిలో ఇచ్చిన ప్రజంటేషన్‌కు వ్యత్యాసం ఉండడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఆయా విభాగాల వారీగా పవర్ పాయింట్ ప్రదర్శన పూర్తయిన తర్వాత సభ్యులు రెండు బృందాలుగా ఏర్పడి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. 24, 25 తేదీల్లో కూడా విభాగాల వారీగా పరిశీలన జరగనుంది.



విశ్వవిద్యాలయంలో పర్యటిస్తున్న న్యాక్ కమిటీ ప్రతినిధులు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి: ఎస్పీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: జిల్లాలో శాంతి, భద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఆర్‌.గంగాధర్ హెచ్చరించారు. బుధవారం వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. కేసుల దర్యాప్తు, పురోగతిని సీఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి క్షుణ్ణంగా సమీక్షించారు. స్థానిక విలేకర్లతో మాట్లాడారు. హనుమాన్‌జంక్షన్‌లో నెల రోజుల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు, గుడవల్లి శివారు నుంచి బొమ్ములూరు వరకు జాతీయ రహదారిపై హైవే మొబైల్ వాహనాల సేవల్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తామని తెలిపారు. తెదేపా నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, గుండవల్లి ఉమాప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, చలసాని శివప్రసాద్‌రావు, పాపారావు, సూరిబాబు, భవానీశంకర్, రవీంద్ర తదితరులు ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు.


గన్నవరం గాంధీ బొమ్మ కూడలి వద్ద ఎత్తుపల్లాలుగా..

వాహనదారులకు భద్రత కరవు


పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద ఇలా..

ప్రమాదం అంచున ప్రయాణం.. ప్రయాణికుల భద్రత శూన్యం అన్నట్లు గన్నవరం నియోజకవర్గంలో సుదీర్ఘ విస్తీర్ణం కలిగిన చెన్నై-కోల్‌కతా రహదారి పరిస్థితి నెలకొంది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే గన్నవరం పట్టణంలోని గాంధీ బొమ్మ కూడలి, పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద హైవే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్నట్లు దర్శనమిస్తోంది. అయినప్పటికీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కనీస చర్యలు చేపట్టక పోవడం గమనార్హం. భారీ గోతులు, ఎత్తుగా తారు దర్శనమివ్వడంతో వాహనదారులు ఎక్కడ ఏమి ఉంటుందో తెలియక బెంబేలెత్తిపోతున్నారు. **- గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే**

వెంట్రప్రగడ పంచాయతీలో భారీ అక్రమాలు!

ఆడిట్‌లో బయటపడ్డ లొసుగులు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామ పంచాయతీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. బుధవారం సహాయ ఆడిట్ అధికారి మధుబాబు వార్షిక ఆడిట్ నిర్వహించారు. పంచాయతీలో 2020 నుంచి 2024 వరకు ఎన్నో అక్రమాలు జరిగినట్లు సమాచారం. ఈ వ్యవహారం గత వైకాపా ప్రభుత్వంలో పొటుచేసుకోగా.. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి పంచాయతీ ఆదాయాన్ని దారి మళ్లించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

వైకాపా హయాంలో 2020 నుంచి 2024 వరకు..

ఈ పంచాయతీ పరిధిలో 2020 నుంచి 2024 వరకు 10 చెరువుల నిర్వహణ ద్వారా రూ.29.39 లక్షలు పంచాయతీకి ఆదాయం రావాల్సి ఉండగా.. ఈ ఏడాది కేవలం రూ.4,07,500 మాత్రమే పాటదారు నుంచి వసూలు చేసినట్లు తేలింది. ఇంటి పన్నుల ద్వారా రూ.12,32,730 రావాల్సి ఉండగా రూ. 8,93,696 జమయ్యాయి. కుళాయిల ద్వారా రూ.1. 81,200కి రూ.57 వేలు వచ్చాయి. తూములు వేయకుండా వేసినట్లు చూపగా, విద్యుత్తు సామగ్రి కొనుగోళ్ల నిమిత్తం రూ.7,93,069 కొనుగోళ్లు చేసినట్లు, వాటికి సంబంధించిన ఓచర్లు లేకపోవడాన్ని గమనించారు. ఇదేవిధంగా శానిటేషన్ నిమిత్తం రూ.6,78,297 ఖర్చు చేయగా బ్లీచింగ్ తదితరాల కొనుగోళ్లకు సంబంధించి ఓచర్లు లేనట్లు నిర్ధారణ అయ్యింది. ఈ పనులకు చేసిన చెల్లింపులు సీఎఫ్ఎంఎస్ ద్వారా జరగాల్సి ఉండగా.. సర్పంచి ఖాతాలో జమచేసి తదుపరి చెల్లింపులు జరిగినట్లు నిర్ధారించడం నిబంధనలకు విరుద్ధం.


దస్త్రాలు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారి మధుబాబు

ముగింపు నిల్వ రూ.785

మంచినీటి నిర్వహణకు రూ.5,48,760 ఖర్చు చేయగా.. ఆర్‌సీ సైపుల కోసం రూ.2.30 లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ ఆదాయం రూ.14,35,915 ఉండగా ఖర్చు రూ.14.65 లక్షలు అయినట్లు చూపించారు. ముగింపు నిల్వ కేవలం రూ.785 మాత్రమే ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే ఈ ఏడాది మార్చి 31 నాటికి 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.32,04,278 కాగా, ఖర్చు రూ.32,01,712గా ఉంది. పారిశుద్ధ్య కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్ల జీతాలు 14 నెలలు బకాయి ఉండగా, సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించిన చాలా ఓచర్లు లేనట్లు అధికారులు గుర్తించారు.

బ్రాయిలర్ ధరలు (కేజీ రూ.ల్లో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం కోడి ధర -110, లైవ్ ధర 132, స్కిన్ [illegible] - 220, స్కిన్‌లెస్ - 251. [illegible]

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

[illegible] గుడ్డు రూ.540 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కేజీ రూ.95/-.


గట్టు విరిగి పోవడంతో నదిలో పడిపోయేందుకు సిద్ధంగా నివాస గృహాలు



కృష్ణమ్మ కోపం.. ఎడ్లంకకు శాపం

జిల్లాలోని అవనిగడ్డ మండలంలో పాత ఎడ్లంక గ్రామం కృష్ణా నదీ గర్భంలో ఉంది. నివాస గృహాలు, పచ్చటి పంటలతో కళకళలాడే లంక భూములు కలిగిన ఈ ద్వీపంపై ఇప్పటి వరకు కరుణ చూపుతూ వచ్చిన కృష్ణమ్మ తాజా వరదల్లో ఉగ్రరూపం చూపి పాత ఎడ్లంకను తనలో కలిపేసుకోవడం ప్రారంభించింది. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గృహాలు కృష్ణార్పణం కాగా అనేక గృహాలు ప్రమాదం అంచున విలవిల్లాడుతున్నాయి. ఊరిని వదిలి వెళ్లిపోదామని గ్రామ ప్రజలు మానసికంగా సిద్ధమయ్యే స్థితికి తీసుకొచ్చింది.

- న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం

ప్రజాపక్షాన పోరాటం చేసే సత్తా కాంగ్రెస్‌కే



మాట్లాడుతున్న బాబ్జీ, వేదికపై డీసీసీ అధ్యక్షుడు కృష్ణ తదితరులు

మచిలీపట్నం (కోనేరు సెంటరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాటం చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జ్ ఎం.బాబ్జి అన్నారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా ఐదేళ్ల అవినీతి, అరాచక పాలనతో విసిగివేసారిపోయిన ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా సైతం లేకుండా చేశారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పాలకులు ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చారన్నారు. వాటి అమలును ప్రశ్నించాలన్నా, ప్రజా హక్కుల కోసం పోరాటం చేయాలన్నా కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి నియోజకవర్గాల వారీగా పర్యటిస్తున్నట్లు వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ, పీసీసీ సభ్యులు దువ్వా మోహనరావు, నాయకులు అబ్దుల్‌మతీన్, కోకా ఫణిభూషణ్, చంద్రశేఖర్, చిలుకోటి ప్రసాద్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

ఘంటసాల (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: సహకార సంఘాలు రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషివిజ్ఞాన కేంద్రంలో కృష్ణా, ఏలూరు జిల్లాల లోని సహకార సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల పాటు నిర్వహించే సర్టిఫికెట్ కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం డాక్టర్ సుధారాణి ప్రారంభించారు. సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి నేలలు వాటి స్వభావం, పంటల సాగు, యాజమాన్య పద్ధతులు పాటించే విధానాన్ని వివరించారు. జిల్లా సహకార సంఘాల అధికారి చంద్రశేఖరరెడ్డి, పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ లహరి తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా: 29-37-141, 2వ ఫ్లోర్, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. సూర్య చంద్రరావు ఈగలపాటి**, తండ్రి : సర్వారాయుడు, ఫ్లాట్ నెం.306, బాలాజీ ఎన్‌క్లేవ్, HAL కాలనీ, గాజులరామారం, కుత్బుల్లాపూర్, కె.వి.రంగారెడ్డి, తెలంగాణ - 500055. **2. ఈగలపాటి జ్యోతి**, భర్త : సూర్య చంద్రరావు, ఫ్లాట్ నెం.306, బాలాజీ ఎన్‌క్లేవ్, HAL కాలనీ, గాజులరామారం, కుత్బుల్లాపూర్, కె.వి.రంగారెడ్డి, తెలంగాణ - 500055. **3. వక్కపట్ల సునీల్**, తండ్రి : శ్రీరామమూర్తి, పెదపూడి, కృష్ణాజిల్లా - 521136. **4. ఈగలపాటి శ్రీనివాస్**, తండ్రి : సర్వారాయుడు, డి.నెం. 49-302/1/ఎ, ఫ్లాట్ నెం.159, పద్మానగర్ ఫేజ్-1, వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర, చింతల్, తిరుమలగిరి, HMT టౌన్‌షిప్, హైదరాబాద్, తెలంగాణ - 500054.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **సూర్య చంద్రరావు ఈగలపాటి** కు చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. CHLPITF1804280001

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు చల్లపల్లిలో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.27.01.2023** నాటికి బకాయి మొత్తం **రూ.59,28,313/-** (అక్షరాల యాభై తొమ్మిది లక్షల ఇరవై ఎనిమిది వేల మూడు వందల పదమూడు రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.09.05.2023**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది.12.04.2024**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.632/2018, అవనిగడ్డ ఎస్ఆర్ఓ ప్రకారంసూర్య చంద్రరావు ఈగలపాటి గారికి చెందినది

కృష్ణాజిల్లా, అవనిగడ్డ సబ్ రిజిస్ట్రీ, నాగాయలంక గ్రామం, గ్రామ పంచాయితీ ఏరియా & మండలం వద్ద సమీప డోర్ నెం.12/28ఎ, ఆర్.ఎస్.నెం.126/1 లోని ఎ.0.06 సెంట్లు లేదా 291 చ।।గ।।ల విస్తీర్ణం గల ఖాళీ ఇంటి స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** ఈగలపాటి సూర్యచంద్రరావు గారి ఆస్తి - 65 లింకులు, **దక్షిణం :** పంచాయితీ రోడ్డు - 92 లింకులు, **పడమర :** భీమా బాబురావు గారి ఆస్తి - 65 లింకులు, **ఉత్తరం :** ఈగలపాటి సూర్యచంద్రరావు గారి ఆస్తి - 100 లింకులు.

ప్రదేశం : విజయవాడ
తేది : 16-10-2024

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా: 29-37-141, 2వ ఫ్లోర్, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. శ్రీ వినోద్ నందమూరి**, తండ్రి : శ్రీ వెంకటేశ్వరరావు, వృత్తి : శాంటస్ మల్టీ క్యూజిన్ రెస్టారెంట్, నివాసం : ఇ.నెం.40-3/1-46/4, ఫ్లాట్ నెం.ఎస్-2, గీతాంజలి అపార్ట్‌మెంట్స్, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, కృష్ణాజిల్లా - 520010. **2. నందమూరి స్వప్న**, భర్త : శ్రీ వెంకటేశ్వరరావు, నివాసం : ఇ.నెం.1-53, నిమ్మకూరు గ్రామం, పామర్రు మండలం, కృష్ణాజిల్లా - 521158. మరియు **నందమూరి లక్ష్మీ కుమారి**, భర్త : శ్రీ వెంకటేశ్వరరావు, నివాసం : ఇ.నెం.40-3/1-46/4, ఫ్లాట్ నెం.ఎస్-2, గీతాంజలి అపార్ట్‌మెంట్స్, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా. **3. నందమూరి లక్ష్మీ కుమారి**, భర్త : శ్రీ వెంకటేశ్వరరావు, నివాసం : ఇ.నెం.1-53, నిమ్మకూరు గ్రామం, పామర్రు మండలం, కృష్ణాజిల్లా - 521158. మరియు **నందమూరి శ్రీ వినయ్**, తండ్రి : శ్రీ వెంకటేశ్వరరావు, నివాసం : ఇ.నెం.40-3/1-46/4, ఫ్లాట్ నెం.ఎస్-2, గీతాంజలి అపార్ట్‌మెంట్స్, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా. **4. నందమూరి శ్రీ వినయ్**, తండ్రి : శ్రీ వెంకటేశ్వరరావు, నివాసం : ఇ.నెం.1-53, నిమ్మకూరు గ్రామం, పామర్రు మండలం, కృష్ణాజిల్లా - 521158. మరియు **నందమూరి శ్రీ వినయ్**, తండ్రి : శ్రీ వెంకటేశ్వరరావు, నివాసం : ఇ.నెం.40-3/1-46/4, ఫ్లాట్ నెం.ఎస్-2, గీతాంజలి అపార్ట్‌మెంట్స్, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా. **5. కొమ్మూరు జాన్ రవి కుమార్**, తండ్రి : కె. పాల్ నరసింహారావు, నివాసం : ఇ.నెం.54-14/8-35/1, ఫ్లాట్ నెం.6, మధురం అపార్ట్‌మెంట్, రోడ్ నెం.3, భారతి నగర్, వినాయక్ థియేటర్ ఎదురుగా, విజయవాడ, కృష్ణాజిల్లా - 520008.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **శ్రీ వినోద్ నందమూరి, నందమూరి లక్ష్మీ కుమారి & నందమూరి శ్రీ వినయ్‌లకు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. VIJA4TF1905170004

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు విజయవాడ-4లో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.05.05.2022**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.05.05.2022** నాటికి బకాయి మొత్తం **రూ.35,52,761/-** (అక్షరాల ముప్పై ఐదు లక్షల యాభై రెండు వేల ఏడు వందల అరవై ఒక్క రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.10.10.2022**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది.28.05.2024**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.1096/2019, పామర్రు ఎస్ఆర్ఓ ప్రకారం శ్రీ వినోద్ నందమూరి, నందమూరి లక్ష్మీ కుమారి & నందమూరి శ్రీ వినయ్ గార్లకు చెందినది

కృష్ణాజిల్లా, పామర్రు సబ్ డిస్ట్రిక్ట్, పామర్రు మండలం, నిమ్మకూరు గ్రామ పంచాయితీ ఏరియా, నిమ్మకూరు గ్రామం, ఆర్.ఎస్.నెం.321 మరియు రీ సర్వే ప్రకారం గల ఆర్.ఎస్.నెం.321/2, డోర్ నెం.2-103 దగ్గర 1518 చ।।గ।।లు లేదా 1275.12 చ।।మీ।।ల విస్తీర్ణం గల స్థలం. **హద్దులు : తూర్పు :** ఎపిఆర్‌జెసి స్కూల్ యొక్క ప్రహరీ గోడ - 71.06 అ।।లు, **పడమర :** పంచాయితీ రోడ్డు - 71.06 అ।।లు, **ఉత్తరం :** నందమూరి నందేశ్వరరావు గారి ఉమ్మడి దారి - 191.00 అ।।లు, **దక్షిణం :** నందమూరి వెంకటేశ్వరరావు మరియు నందమూరి లక్ష్మణ స్వామి గార్ల ఉమ్మడి దారి - 191.06 అ।।లు.,

పైన తెలిపిన హద్దులలో విస్తీర్ణం 1518 చ।।గ।।లు లేదా 1275.12 చ।।మీ।।ల స్థలం మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.2206/2018, పామర్రు ఎస్ఆర్ఓ ప్రకారం "బి షెడ్యూలు" లోని ఐటమ్ నెం.3 ప్రకారం కలదు).

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా: 29-37-141, 2వ ఫ్లోర్, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. మురళీ కృష్ణ కమ్మిలి**, తండ్రి : లక్ష్మణ స్వామి కమ్మిలి, ఎఫ్.నెం.402, నాగపూర్ణ టవర్స్, బల్లెం వారి వీధి, వాటర్ ట్యాంక్ దగ్గర, ప్రసాదంపాడు, కృష్ణాజిల్లా - 521108. **2. పద్మ ప్రియ కమ్మిలి**, భర్త : మురళీ కృష్ణ, ఎఫ్.నెం.402, నాగపూర్ణ టవర్స్, బల్లెం వారి వీధి, వాటర్ ట్యాంక్ దగ్గర, ప్రసాదంపాడు, కృష్ణాజిల్లా - 521108. **3. బసవ శంకరరావు పుప్పాల**, తండ్రి : వెంకట పూర్ణ చంద్రరావు, డి.నెం.4-312, విజయవాడ, కృష్ణాజిల్లా - 521108.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **మురళీ కృష్ణ కమ్మిలికు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. NUZVDTF1705300009

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు నూజివీడులో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.27.01.2023** నాటికి బకాయి మొత్తం **రూ.96,88,278/-** (అక్షరాల తొంభై ఆరు లక్షల ఎనభై ఎనిమిది వేల రెండు వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.29.04.2023**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది.12.02.2024**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.3496/2017, గన్నవరం ఎస్ఆర్ఓ ప్రకారం మురళీ కృష్ణ కమ్మిలి గారికి చెందినది

కృష్ణాజిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రీ, కేసరపల్లి హమ్లెట్, వెంకట నరసింహాపురం గ్రామం వద్ద సబ్ డివిజన్ నెం.53/5సి, ఆర్.ఎస్.నెం.53/5 లోని ఎ.0.06 సెంట్ల 425 లింకులు లేదా 311 చ।।గ।।లు లేదా 260.03 చ।।మీ।।ల విస్తీర్ణం గల ఖాళీ నివాస స్థలం. **హద్దులు: తూర్పు :** కె. జ్ఞానమ్మ మరియు ఇతరుల మిగిలిన ఆస్తి - 72 అ।।లు, **దక్షిణం :** జాస్తి కనకరావు గారి ఆస్తి - 38.9 అ।।లు, **పడమర :** కాసన్నేని నాగేశ్వరరావు గారి ఆస్తి - 72 అ।।లు, **ఉత్తరం :** 24 అ।।ల వెడల్పు ఉమ్మడి దారి - 38.9 అ।।లు.,

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా: 29-37-141, 2వ ఫ్లోర్, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. పరిమళ కమ్మిలి**, భర్త : నాగ రవికుమార్, డి.నెం. 4-147, పోలవరం, గూడూరు, కృష్ణాజిల్లా - 521162. **2. కె. నాగ రవి కుమార్**, తండ్రి : శివ ప్రసాద్, డి.నెం.4-147, పోలవరం, గూడూరు, కృష్ణాజిల్లా - 521162. **3. చల్లంశెట్టి విజయ కుమారి**, భర్త : రంగనాధరావు, డి.నెం. 20/502, చిలకలపూడి, మచిలీపట్నం, కృష్ణాజిల్లా - 521002. **4. కొక్కిలగడ్డ పోతురాజు**, తండ్రి : కోదండ రామయ్య, డి.నెం. 27/219-2, పాత రామన్నపేట, మచిలీపట్నం, కృష్ణాజిల్లా - 521001.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **చల్లంశెట్టి విజయ కుమారి** కు చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. GUDVDTF1804280007

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు గుడివాడలో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.27.01.2023** నాటికి బకాయి మొత్తం **రూ.72,47,084/-** (అక్షరాల డెబ్బై రెండు లక్షల నలభై ఏడు వేల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.09.05.2023**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది.12.04.2024**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.1319/2018, మచిలీపట్నం ఎస్ఆర్ఓ ప్రకారం చల్లంశెట్టి విజయ కుమారి గారికి చెందినది

కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్ డిస్ట్రిక్ట్, వార్డు నెం.20, మచిలీపట్నం మున్సిపల్ సర్క్యూట్-5, మచిలీపట్నం మున్సిపల్ యూనిట్స్, చిలకలపూడి, డి.నెం.20/502ఎ, సర్వే నెం.377/1,2 లోని ఎ.28.80 సెంట్ల విస్తీర్ణం, దీనిలో 392 చ।।గ।।లు లేదా 327.76 చ।।మీ।।ల విస్తీర్ణం గల ప్లాట్ నెం. సి 12 ఖాళీ స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** ఉమ్మడి దారి మరియు ప్లాట్ నెం. సి 13 - 111 అ।।లు, **దక్షిణం :** 40 అ।।ల లే అవుట్ రోడ్డు - 74 అ।।లు, **పడమర :** ఎన్‌జిఓ ఎంప్లాయిస్ కో-ఆప్ బిల్డింగ్ సొసైటీ ప్లాట్స్ - 143 అ।।లు, **ఉత్తరం :** హద్దు లేదు.

పైన తెలిపిన హద్దులలో విస్తీర్ణం 392 చ।।గ।।లు లేదా 327.76 చ।।మీ।।ల ఖాళీ స్థలంలో గల ప్లాట్ నెం. సి 12 మాత్రమే. (ఈ ఆస్తి మచిలీపట్నం ఎస్ఆర్ఓ యొక్క డాక్యుమెంట్ నెం.3903/2011 ప్రకారం కలదు).

ప్రదేశం : విజయవాడ
తేది : 16-10-2024

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా: 29-37-141, 2వ ఫ్లోర్, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. రామారావు కొడ్రకుంట**, తండ్రి : కృష్ణయ్య, డి.నెం. 11-64-25, గులాం మోహిద్దీన్ వీధి, ఫిష్ మార్కెట్, కొత్తపేట, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520001. **2. కొడ్రకుంట భూలక్ష్మి**, డి.నెం. 11-64-25, గులాం మోహిద్దీన్ వీధి, ఫిష్ మార్కెట్, కొత్తపేట, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520001. **3. చిరుకూరు కోటేశ్వరరావు**, తండ్రి : సుబ్బయ్య, డి.నెం. 76-1-19/1, పాత హెచ్‌బి కాలనీ, భవానీపురం, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520012.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **రామారావు కొడ్రకుంటకు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. VIJA2TF1408300002

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు విజయవాడ-2లో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.27.01.2023** నాటికి బకాయి మొత్తం **రూ.3,36,34,415/-** (అక్షరాల మూడు కోట్ల ముప్పై ఆరు లక్షల ముప్పై నాలుగు వేల నాలుగు వందల పదిహేను రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.12.08.2023**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది.28.05.2024**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.2472/2014, నున్న ఎస్ఆర్ఓ ప్రకారం రామారావు కొడ్రకుంట గారికి చెందినది

ఎన్‌టిఆర్ జిల్లా, నున్న సబ్ డిస్ట్రిక్ట్, విజయవాడ రూరల్ మండలం, పాతపాడు గ్రామ పంచాయితీ ఏరియా, పాతపాడు గ్రామం, ఆర్.ఎస్.నెం.217/5బి3 లోని ఎ.0.47 సెంట్ల విస్తీర్ణం గల సేరి మెట్ట భూమి. **హద్దులు : తూర్పు :** సర్వార్ రోడ్డు, **దక్షిణం :** పిల్లా కనకమ్మ గారి భూమి, **పడమర :** పోతిన సింహాచలం గారి భూమి, **ఉత్తరం :** పోతిన దుర్గారావు మొ।। వారి భూమి.

పైన తెలిపిన హద్దులలో విస్తీర్ణం ఎ.0.47 సెంట్లు లేదా 0.190 హెక్టార్లు సేరి మెట్ట భూమి మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.192/2012, నున్న ఎస్ఆర్ఓ ప్రకారం కలదు).

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా: 29-37-141, 2వ ఫ్లోర్, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. శివ నాగ భూషణం మాగులూరి**, తండ్రి : అంకారావు, డి.నెం. 3-264, శివాలయం వీధి, ఉయ్యూరు (గ్రామం & మండలం), కృష్ణాజిల్లా - 521165. **2. గంటా సురేష్**, తండ్రి : పుల్లేశ్వర రావు, డి.నెం. 4-189, కాపుల రామాలయం వీధి, ఉయ్యూరు గ్రామం, కృష్ణాజిల్లా - 521165.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **శివ నాగ భూషణం మాగులూరికు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం.లు NRTFVUY10E00046 & VUYY4TF12280005

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు ఉయ్యూరులో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.27.01.2023** నాటికి బకాయి మొత్తం **రూ.83,98,390/-** (అక్షరాల ఎనభై మూడు లక్షల తొంభై ఎనిమిది వేల మూడు వందల తొంభై రూపాయలు మాత్రమే) మరియు **రూ.1,17,61,597/-** (అక్షరాల ఒక కోటి పదిహేడు లక్షల అరవై ఒక్క వేల ఐదు వందల తొంభై ఏడు రూపాయలు మాత్రమే), **మొత్తం కలిపి రూ.2,01,59,987/-** (అక్షరాల రెండు కోట్ల ఒక లక్ష యాభై తొమ్మిది వేల తొమ్మిది వందల ఎనభై ఏడు రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.08.05.2023**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది.13.06.2024**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.4183/2010 & 5383/2011, ఉయ్యూరు ఎస్ఆర్ఓ ప్రకారం శివ నాగ భూషణం మాగులూరి గారికి చెందినది

కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, ఉయ్యూరు సబ్ డిస్ట్రిక్ట్, ఉయ్యూరు మండలం, ఉయ్యూరు గ్రామ పంచాయితీ పరిధిలో (గ్రామ ఖాతాలో), 149.8.7 1/2 చ।।గ।।లు లేదా 125.47 చ।।మీ।।ల విస్తీర్ణం గల స్థలం మరియు అందు నిర్మించిన డి.నెం.3-267వ తో గల రెండంతస్తుల భవనం ఆస్తి అన్నీ ఫిక్చర్స్ మరియు సదుపాయాలతో కలదు. **హద్దులు : తూర్పు :** మాగులూరి శివ నాగ భూషణం గారి ఇంటి స్థలం - 52.9 అ।।లు, **పడమర :** వెంకట సుబ్బారావు మరియు ఇతరుల దారి కొరకు వదిలిన సగం గజం వెడల్పు గల స్థలం - 54 అ।।లు, **ఉత్తరం :** మాగులూరి అంకారావు గారి స్థలం - 27 అ।।లు, **దక్షిణం :** రాజా వీధి (వీధి) - 23.6 అ।।లు.

ప్రదేశం : విజయవాడ
తేది : 16-10-2024

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

మచిలీపట్నం

●మచిలీపట్నం ●పెడన

ఏఆర్ ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ


సత్యనారాయణ

మచిలీపట్నం (క్రైం), న్యూస్‌టుడే: ఏఆర్(ఆర్మ్‌డ్ రిజర్వ్) ఏఎస్పీగా బి. సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఏఎస్పీగా విధులు నిర్వహించిన ఎస్‌వీడీ ప్రసాద్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు


రాజేంద్ర ప్రసాద్

పెడన, న్యూస్‌టుడే: పెడన ఎస్సై-2గా వి.రాజేంద్ర ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇంతకుముందు కోడూరు ఎస్సై-2గా పనిచేశారు. పెడనలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడతామని శాంతి భద్రతలను పూర్తి అదుపులో ఉంచేలా విధులు నిర్వర్తిస్తానని చెప్పారు.

కార్మికులకు పూర్తి స్థాయి జీతాలు చెల్లించాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: కార్మికులకు పూర్తి స్థాయిలో జీతాలు చెల్లించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు బెల్లంకొండ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలలో సెక్యూరిటీ గార్డులకు ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదని ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 151 జీవో ప్రకారం రూ.12,500 జీతం ఇవ్వాలన్నారు. గుత్తేదారు పీఎఫ్ నిబంధనలకంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సంఘ నాయకులు కె.రత్నాకరరావు, మీనాకుమారి, ఎల్.రాజు, వై.అంజలక్ష్మి, సురేష్, ఎండీ అనీఫ్ పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం.. ప్రతిభకు సోపానం


విజేతలకు బహుమతులు ఇస్తున్న ప్రిన్సిపల్ తదితరులు


వ్యాసం రాస్తున్న విద్యార్థులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విద్యార్థుల తమ ప్రతిభను చాటి కునేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని నగరంలోని బాలాజీ విద్యాలయ ప్రిన్సిపల్ కొమరగిరి చంద్రశేఖర్ అన్నారు. బాలాజీ విద్యాలయంలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో సహియా అంజుమ్(9వతరగతి), జి.జయశ్రీ(9వతరగతి), జి.హర్షవర్ధిని(8వతరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్‌తో పాటు హెచ్ఎం కొమరగిరి హిమబిందు, ఉపాధ్యాయురాలు ఎస్.ఈశ్వరీదేవి తదితరులు కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు.

డీటీపాలెంలో బెల్లపు ఊట ధ్వంసం


నాటుసారా డంప్‌తో అధికారులు

ఈనాడు స్పందన

పెడన, న్యూస్‌టుడే: స్థానిక దక్షిణ తెలుగుపాలెంలో ఎక్సైజ్ అధికారులు బుధవారం నాటుసారా బట్టీలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. 200లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. నాటుసారా తయారీలో వినియోగించే పాత్రలు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు పరారయ్యాడు. 'నాటుసారా అడ్డాగా డీటీ పాలెం' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందనగా ఈ దాడులు జరిగాయి. మచిలీపట్నం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.

ప్రగతి విరిసేలా.. నగరం మురిసేలా..

✦ ఆర్థిక సంఘం నిధులు విడుదల
✦ అభివృద్ధి పనులకు రూపకల్పన

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

మచిలీపట్నం నగరంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నగరపాలక సంస్థ కార్యాచరణ చేపట్టింది. ఇటీవల ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంతో నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా డివిజన్ల వారీగా ఉన్న సమస్యలు గుర్తించి వాటిలో ప్రాధాన్యతా ప్రకారం వసతులు కల్పించాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగానే ప్రతిపాదనలు చేస్తున్నారు.

నగరంలో డివిజన్లు:	50
జనాభా:	1.80 లక్షలు
మొత్తం ఇళ్లు:	56,000
విడుదలైన ఆర్థిక సంఘం నిధులు:	రూ.3.65 కోట్లు

చేపట్టనున్న పనులు
సీసీ డ్రెయిన్లు, పార్కులు వసతులు, శ్మశానవాటికల్లో మౌలిక వసతులు, నగరపాలక స్థలాలకు రక్షణ పనులు

ఇదీ పార్కుల పరిస్థితి..

✦ నగర వ్యాప్తంగా 80కి పైగా పార్కులు ఉన్నాయని అధికారిక గణాంకాలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అన్నింటిలో ఆహ్లాదం పంచేవి పదిలోపే ఉంటాయి.


నాయర్‌బడ్డీ సెంటర్‌లో అలంకారప్రాయంగా పార్కు


శ్రీనివాసనగర్ కాలనీలో తటాకంలా పార్కు స్థలం

✦ శ్రీనివాసనగర్ కాలనీలో పార్కు స్థలంలో మురుగు నీరు చేరి తటాకంలా తయారైంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. సర్కారు తోటలో పార్కు కూడా అదే పరిస్థితి. భాస్కరపురంలో పార్కు కూడా ఇదే పరిస్థితి. పార్కుపరంగా అభివృద్ధి చేయకపోవడంతో కొంతకాలంగా క్రీడా ప్రాంగణంగా వినియోగించుకున్నారు.

అధ్వానంగా ఉన్నవి ఇవే..

✦ ప్రస్తుతం దానికి కూడా ఉపయోగం లేకుండా తయారైంది. ✦ నాయర్‌బడ్డీ సెంటరులోని పార్కు అభివృద్ధి చేశారన్న మాటే కానీ కన్నాళ్లకే అలంకారప్రాయంగా తయారైంది. కేవీఆర్ పార్కు, పుస్తక పఠన కేంద్రం అస్తవ్యస్తంగా మారడంతో పాటు మురుగు దొడ్డి కూడా పాడైపోయాయి. ఇలా ఏయే పార్కుల్లో వసతులు కల్పించాల్సి ఉందో గుర్తించి దానికి అనుగుణంగా ప్రతిపాదనలు చేసేందుకు సిద్ధం అయ్యారు.

ఇలా చేస్తారు..

✦ ప్రభుత్వ ఆదేశంతో సీఎస్ఆర్ ఫండ్స్ రూ.1.35కోట్లతో పలు పార్కులను అభివృద్ధి చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు ఇటీవల ప్రతిపాదనలు చేశారు. ✦ పచ్చదనంతో పాటు వ్యాయామశాల, క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్ తదితర వసతులు కల్పించాలని నిర్ణయించారు. ✦ హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కుతో పాటు పైలాన్ పార్కు, ఎన్‌జీవోస్ కాలనీలోని పార్కులను తొలి విడత అభివృద్ధి చేయడానికి సంకల్పించారు.

సీసీ డ్రెయిన్ల నిర్మాణం

నగరంలోని వివిధ ప్రాంతాల్లో అంతర్గత డ్రెయిన్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ఉన్నా ఉపయోగం లేకుండా తయారయ్యాయి. ✦ గొడుగుపేట, భాస్కరపురం, చింతగుంటపాలెం, బలరామునిపేట, నిజాంపేట వంటి అనేక ప్రాంతాల్లో డ్రెయిన్లు లేవు. ప్రస్తుతం ఎక్కడెక్కడ సమస్య తీవ్రంగా ఉందో గుర్తించి ఆయా ప్రాంతాల్లో డ్రెయిన్లు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ✦ నగరపాలక సంస్థ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ ఏర్పాట్లు చేయనున్నారు. ✦ శ్మశానవాటికల్లో వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరలోనే పనులు: బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్



నగరపాలక సంస్థకు మంజూరైన నిధులు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా వెచ్చించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగానే పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించడంతో పాటు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

నచ్చిన చోట ధాన్యం విక్రయం

గూడూరు, న్యూస్‌టుడే: రైతులకు నచ్చిన చోట ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని రాయవరంలో రీసర్వేపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఏవో మాట్లాడుతూ.. ధాన్యం రైతులకు ఇష్టం వచ్చిన చోట ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పించిందన్నారు. అందరూ వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచి మల్లేశ్వరి, రీసర్వే డీటీ సాయి, వీఆర్వో అంకాలరావు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో ఈషా గ్రామోత్సవం

విజయవాడ సిటీ: మన సంప్రదాయ గ్రామీణ క్రీడలకు మరుగవుతున్న తరుణంలో... వాటిని పరిరక్షించేందుకు ఈషా ఔట్‌రీచ్ 16వ వార్షిక గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త జి.శివలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. నవంబరు 16, 17 తేదీల్లో అవనిగడ్డ ప్రభుత్వ కళాశాల మైదానంలో వాలీబాల్ (పురుషులు), త్రోబాల్ (మహిళలు) పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు ఉప కేంద్రంలో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేంద్రం పరిధిలోని గ్రామాల్లో గురువారం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మచిలీపట్నం ఏఈ జీవీ శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.00 గంటల మధ్య గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉత్పన్నమవుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి


బంటుమిల్లిలో సీపీఎం నాయకుల నిరసన

బంటుమిల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యుత్తు బిల్లులపై ప్రతిపాదించిన ట్రూఅప్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్థానిక విద్యుత్తు ఉప కేంద్రం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రూ.8114 కోట్లు భారం ట్రూఅప్ ఛార్జీల పేరిట ప్రజలపై మోపాలనుకోవడం సమంజసం కాదన్నారు. నాయకులు ఎం.శివశ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, ఎల్.ఆంజ్ హోప్, దస్రీ, కృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ప్రతిభ చాటిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మల్లవోలు(గూడూరు), న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. జగ్గయ్యపేటలో ఈ నెల 22న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో అండర్-14 విభాగంలో పి.యోషిత, పి.రూత్ మ్రేస్సీ, అండర్-17 విభాగంలో కే.కీర్తన, కె.దీపికలు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్ తెలిపారు. హెచ్ఎం కె.అరుణ, ఉపాధ్యాయులు రవి, రాజేష్ అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? నగరంలోని జిల్లా కోర్టు సెంటరు నుంచి నాయర్‌బడ్డీ సెంటరుకు వెళ్లే రహదారి పక్క వరకు దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సాయంత్రం సమయంలో కళాశాల విద్యార్థులు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు.
- వెంకటేశ్వరరావు

✔ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం.
- బాపిరాజు, నగరపాలకసంస్థ కమిషనర్

? గూడూరు మండలం మల్లవోలు పంచాయతీ పరిధిలోని ముదిరాజుపాలెంలో వీధిదీపాలు వెలగకపోవడంతో రాత్రిపూట రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. -పాండురంగారావు, మల్లవోలు

✔ వెంటనే సిబ్బందిని పంపి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. - తోట సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి
- మచిలీపట్నం(గొడుగుపేట),గూడూరు,న్యూస్‌టుడే

? నడుపూరు- వాడపల్లి కొత్తపల్లి రహదారి నిర్మించలేదు. నేలకొండపల్లి నుంచి లంకల కలువగుంట వరకు అధ్వానంగా మారింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

✔ సుమారు రూ.26 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రహదారి నిర్మాణం ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.
- కె.వెంకట లక్ష్మి, లంకల కలువగుంట సర్పంచి
- న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

పాండురంగస్వామి ఉత్సవాలకు సంసిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: చిలకలపూడి పాండురంగస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. కార్తిక మాసంలో నిర్వహించే ఉత్సవాల నిమిత్తం బుధవారం ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గతంలో ఎంతో అట్టహాసంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. వైకాపా పాలనలో ఉత్సవ ప్రభ తగ్గిపోయిందన్నారు. ఉత్సవాల నిమిత్తం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, ఇతరత్రా అవసరమైన ముందస్తు కార్యక్రమాలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. కూటమి నాయకులు బండి రామకృష్ణ, గోపీచంద్, బాబాప్రసాద్, కాశీవిశ్వనాథం, పంతం గజేంద్రరావు, ఫ్రిన్స్ గోల్డ్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, ఆలయ నిర్వాహకులు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

పెడన, న్యూస్‌టుడే: 216 జాతీయ రహదారిపై మడక పెట్రోల్ బంకు ఎదురుగా ఇటీవల ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో నియంత్రణకు అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. గత నెల నుంచి ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. బంకు లోపల నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న వాహనాలు ఢీకొడుతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంక్ లోపలి నుంచి వచ్చే చోటకు జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలు కనిపించేలా రహదారికి ఒక పక్కగా అడ్డాన్ని ఎస్సై సత్యనారాయణ ఏర్పాటుచేశారు.

వసతిగృహం.. శిథిలం..


బీసీ బాలికల వసతి గృహం


ధ్వంసమైన హాస్టల్ లోపలి భాగం

పెడన, న్యూస్‌టుడే: పెడనలోని బ్రహ్మపురంలో గూడూరు రహదారి పక్కన నిర్మించిన బీసీ బాలికల వసతి భవనం శిథిలావస్థకు చేరింది. దాదాపు 20ఏళ్ల కిందట నిర్మించిన ఈ హాస్టల్లో పాఠశాల, కళాశాల బాలికలకు వసతి సదుపాయం ఉంది. కళాశాల విద్యార్థినులు ఉండకపోవడంతో ఆ విభాగం మూతపడింది. పాఠశాల స్థాయి విద్యార్థినులు ఈ వసతి గృహంలో చేరాలంటే ఆందోళన చెందుతున్నారు. భవనం పై కప్పు పెచ్చులూడి ఎప్పుడు కూలిపోతుందోనని తల్లిదండ్రులు, బాలికల్లో భయం నెలకొంది. దీంతో సమీప ప్రాంతాలకు చెందిన బాలికలను హాస్టల్లో ఉంటున్నట్లు నమోదుచేసి నిర్వహిస్తున్నారు. హాస్టల్ భవనం పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారు చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని మేట్రిన్ మేరీ శోభలత తెలిపారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం


మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: వృద్ధులకు ఉచిత న్యాయసహాయం అందిస్తున్నందున వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య అన్నారు. బుధవారం చిలకలపూడి రైల్వేస్టేషన్ ప్రాంతంలోని అన్నపూర్ణ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి వివిధ అంశాలపై ఆరా తీశారు. వృద్ధులకు పిల్లల నుంచి మనోవర్తి పొందే అవకాశాన్ని చట్టం కల్పిస్తుందని, వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా సంస్థ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు న్యాయవాదులు లీలి ముసలయ్య, అజ్జుతున్సీసాలు వివిధ చట్టాల గురించి వివరించారు. ఆశ్రమ నిర్వాహకురాలు కొల్లి సుశీల, వృద్ధులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పెడన (గ్రామీణం, న్యూస్‌టుడే : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మానవ హక్కుల వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బొడ్డపాటి దేవదాసు తెలిపారు. నందమూరు వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. సమాచార హక్కుచట్టం, బాల్య వివాహాల నిర్మూలన చట్టం, పోక్సో చట్టం, మహిళల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవాడ ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపల్ టీఆర్‌ఎస్ రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త ఎస్.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు కొత్తగా నమోదు తప్పనిసరి

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: రాబోయే పట్టభద్రుల శాసన మండలి కృష్ణా-గుంటూరు స్థానానికి జరిగే ఎన్నికల్లో ఓటు వేయాలంటే పాత 18ని కొత్తగా సమర్పించాలని తెదేపా సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ తెలిపారు. బుధవారం సిటీలో ఆగ్రహారంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు రూపొందించిన కరపత్రాలను గోపీచంద్ ఆవిష్కరించారు. నవంబరు 6వ తేదీ లోపు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారని, ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఫారం 18 ఆఫ్‌లైన్‌లోను, ఆన్‌లైన్‌లోను నమోదు చేసుకోవాలన్నారు. తెదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల వెంకట కాంతారావు, తెదేపా జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్, తెదేపా నాయకులు పామర్తి లక్ష్మణ్, సుంకర నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్లపై ఆవులు.. ట్రాఫిక్‌కు అవస్థలు


మచిలీపట్నం-గుడివాడ రోడ్డుపై నిలిచిన ట్రాఫిక్

పెడనలో రహదారులపై పశువుల సమస్య తీవ్రంగా మారుతోంది. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పశుపోషకులు తమ ఆవులను వదిలేయడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మచిలీపట్నం-గుడివాడ- బంటుమిల్లి ప్రధాన రహదారితో పాటు ఇతర మార్గాల్లోనూ ఈ సమస్య ఉంది. స్థానిక బంటుమిల్లి రోడ్డు నుంచి బస్టాండు సెంటరు వరకు కిలోమీటరు రహదారి దాటేందుకు కనీసం అరగంట పడుతోంది. గురువారం రాత్రి 8గంటల ప్రాంతంలో గోవులు ఒకేసారిగా రహదారి పైకి రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీనిపై కమిషనర్ రామారావు స్పందిస్తూ.. ఆవుల యజమానులకు తిరిగి నోటీసులిచ్చామని అప్పటికీ స్పందించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. -పెడన, న్యూస్‌టుడే

కంటి వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న నిపుణులు, పర్యవేక్షిస్తున్న సంఘ నాయకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయానికి చెందిన నిపుణులు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. 24 మందికి పరీక్షలు నిర్వహించగా నలుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రతి నెలా రెండు, నాలుగో బుధవారాల్లో పరీక్షలు జరుగుతాయని వినియోగించుకోవాలని కోరారు. నాయకులు శంకరరావు, బీకె దుర్గారావు, ఎం.ఎ.సత్యనారాయణ, సయ్యద్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు 4 నుంచి శిక్షణ

పెడన (గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధానోపాధ్యాయులకు నవంబర్ 4వ తేదీ నుంచి పాఠశాలల నాయకత్వ లక్షణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఎస్ ఏఎంఓ ఆర్.శ్యాంసుందరరావు తెలిపారు. ఆగిరిపల్లి దగ్గర హీల్ ప్యారడైజ్‌లో ఒక్కో బ్యాచ్‌నకు వారం రోజుల పాటు శిక్షణ ఉంటుందని బుధవారం ఆయన పేర్కొన్నారు. జిల్లాలో 240 మంది ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఉంటుందని వివరించారు. ప్రధానోపాధ్యాయుల జాబితాలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద మృతిగా కేసు


సత్యనారాయణ మృతదేహం

చినగొల్లపాలెం(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం దీవిలోని సముద్రపు ఒడ్డున ఓ వ్యక్తి శరీరం దొరకడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కృత్తివెన్ను ఎస్సై ఎ.పైడిబాబు తెలిపారు. నామా గ్రామానికి చెందిన సత్యనారాయణ (42) మంగళవారం పనికి వెళ్లి తిరిగి రాలేదని భార్య సుందర దేవమ్మ బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. విచారణ చేపట్టగా బుధవారం ఉదయం సముద్రపు ఒడ్డున మృతి చెంది ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందిందన్నారు. మటనా స్థలాన్ని పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎస్సై ఎ.పైడిబాబు సిబ్బంది పరిశీలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు ఎస్సై తెలిపారు. సత్యనారాయణకు భార్య, కుమారుడు, వివాహితురాలైన కుమార్తె ఉన్నారు.

పాఠశాలలకు నిధులు విడుదల

పెడన (గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాకు రెండు నర్లర్ తరువాత పాఠశాలలకు, ఎంతో అవసరం ఉన్న నిధులు విడుదలయ్యాయి. 2024-25 సంవత్సరానికి నిర్వహణ నిధులు రూ.1.50 కోట్ల నిధులు విడుదలయ్యాయి. 25 మండలాల్లోని 1299 పాఠశాలలకు, 25 ఎమ్మార్సీలకు ఇవి మంజూరయ్యాయి. పాఠశాలలకు 50 శాతం నిధులు, ఎమ్మార్సీలకు నూరుశాతం నిర్వహణ నిధులు జమయ్యాయి. పాఠశాలల్లో జాతీయ దినోత్సవాల నిర్వహణ, విద్యుత్తు బిల్లుల చెల్లింపులు, పుస్తకాల వంటి తదితర కార్యక్రమాలకు ఈ నిధులు వెచ్చించడానికి అవకాశం ఉంది. ఈ నిధుల్ని త్వరలో విడుదల చేస్తామని ఎస్ఎస్ ఏఎంఓ ఆర్.శ్యాంసుందరరావు తెలిపారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు



'న్యూస్‌టుడే'తో మచిలీపట్నం ఆర్టీసీ డీఎం పెద్దిరాజు

న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బస్టాండులో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా ఇటీవల వేగవంతం చేయడంతో చివరి దశకు చేరుకున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో పలు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు తెలిపారు. వివిధ గ్రామాలకు అవసరమైన సర్వీసులు వేస్తున్న ఏర్పాట్లు, నిబంధనలు ఉల్లంఘించిన ఉద్యోగులపై తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే'తో ముఖాముఖి మాట్లాడారు.

ముఖాముఖి

అభివృద్ధి పనులు వేగవంతం

బస్టాండ్‌లో రూ.3.4కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఆదనపు ప్లాట్‌ఫామ్స్ నిర్మించి విస్తరించడం, ప్రయాణికులు వేచి ఉండే గది, మరుగుదొడ్లు, కార్గో కార్యాలయ భవనం, గోదాం, ఫ్లోరింగ్ పనులు చేపట్టాం. ఆర్టీసీ కార్మికుల డిస్పెన్సరీ భవనం ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం. మరుగుదొడ్ల పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తాం. కార్ పార్కింగ్ కోసం షెడ్ నిర్మాణం పూర్తవగా చుట్టూ మెష్ నిర్మించాల్సి ఉంది. డీలక్స్ లాంజ్, పోర్టికో, క్యాంటీన్ పనులు జరుగుతున్నాయి.

ఆర్టీసీని ప్రజలు వినియోగించుకోవాలి

గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రూట్లలో పలు సర్వీసులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆయా రూట్లలో సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. బస్సులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వాటిని ప్రజలు వినియోగించుకోవాలి. ఇటీవల కూడా...

ఉదయం, సాయంత్రం సమయాల్లోనే సమస్య..

విజయవాడకు బస్సుల కొరత లేదు. మచిలీపట్నం నుంచి విజయవాడకు ప్రతి పది నిమిషాలకు నాన్‌స్టాప్ సర్వీసు ఉంది. ఇవి కాకుండా పల్లెవెలుగు సర్వీసులు నడుపుతున్నాం. ఉదయం, సాయంత్రం సమయాల్లో విజయవాడ బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్‌జాం కావడంతో కొంత సమస్య ఏర్పడుతోంది. ఆ సమయాల్లో కూడా ప్రయాణికులకు ఇబ్బందులు పడకుండా వేరే బస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

లీపట్నం నుంచి మంటసాల తదితర ప్రాంతాలకు సర్వీసులు ఏర్పాటు చేశాం. ✶ కేవలం విద్యార్థుల కోసమే 11 బడి బస్సులు నడుపుతున్నాం. కృష్ణా విశ్వవిద్యాలయంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం మచిలీపట్నం నుంచి కొత్తపల్లి, రామన్నపేట, పెదపట్నం, క్యాంప్‌బెల్‌పేట ఇలా మొత్తం 11 సర్వీసులు ఏర్పాటు చేశాం. కార్తిక మాసం సందర్భంగా పంచారామాలకు బస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

సకాలంలో అందించేలా చర్యలు

కార్గో ద్వారా పార్సిళ్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం. బెంగళూరు, చెన్నై, అనంతపురం, కర్నూలు లాంటి కొన్ని ప్రాంతాలకు విజయవాడ నుంచి వెళ్లాలి. అక్కడ నుంచి వెళ్లాల్సి ఉండటంతో కొంత సమయం పడుతోంది. ప్రస్తుతం అది పరిష్కారమైంది. మిగిలిన ఆన్నిరూట్లకు ఇక్కడి నుంచి నేరుగా పంపుతున్నాం. కార్గో సేవలకు డిమాండ్ ఉండటంతో మండల కేంద్రాల్లో కూడా ఏజెంటులను ఏర్పాటు చేస్తున్నాం.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

ఇటీవల పెడన నుంచి విశాఖపట్నంకు పార్శిల్ తీసుకెళ్తారని ఫిర్యాదుతో విశాఖ ట్రిప్‌లో అధికారులు తనిఖీలు చేసి గుర్తించారు. ఓ వ్యక్తి వద్ద రూ.300 తీసుకుని పార్శిల్ తీసుకెళ్తున్నట్లు నిర్ధారణ కావడంతో ఇద్దరు డ్రైవర్లను సస్పెండ్ చేశాం. ఇలా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే తనిఖీ ప్రక్రియ, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ప్రతిభకు పదును


పోరంకి: విజేతలతో ప్రిన్సిపల్ నాగ అర్చన



యనమలకుదురు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

పోరంకి, యనమలకుదురు(పెనమలూరు), న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం రెండు పాఠశాలల్లో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు మంచి స్పందన లభించింది. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశాలపై జరిగిన వ్యాస రచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ పోరంకి శ్రీ ఉషోదయ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పి.కుముద నాగ పూర్ణ (8), కె.నవ్య దీపిక (10), యు.శ్రీ కృష్ణ హంసిక (9) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ బి. నాగ అర్చన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ యార్లగడ్డ రాజ బాబు, కోఆర్డినేటర్ టి.వి.ఎస్ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ యనమలకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్. మేఘన (10), షేక్ అఫ్రీన్‌బేగం(9), కె.వాసు(10) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.జోజయ్య, ఉపాధ్యాయులు టి.భాస్కర్, రూపవాణి ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను అందజేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం


చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఝాన్సీ, రత్నకిషోర్

వరద బాధితులను ఆదుకునేందుకు వీలుగా హనుమాన్ జంక్షన్ వాసి, ఈపీ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వాహకుడు మండవ రత్నకిషోర్ రూ.2 లక్షలు విరాళంగా అందించారు. దీంతో పాటు ఆమె తల్లి ఝాన్సీరాణి వ్యక్తిగతంగా మరో రూ.50 వేలు అందజేశారు. బుధవారం సీఎం చంద్రబాబును కలిసి చెక్కులు అందజేశారు. – న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

కానూరు ఎస్‌బీఐ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికుడు కుందేటి శాస్త్రి 'మేమున్నాం తోడుగా' దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమస్యను కమిషనర్ భవానీ ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

? కానూరు ఉమాశంకర్‌నగర్, చలసానినగర్, తులసీనగర్ ప్రాంతాల్లో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి.
- వై.మల్లేశ్వరరావు, కానూరు

? సనత్‌నగర్‌లో దోమల సమస్య ఎక్కువగా ఉంది.
- శ్రీహరి, సనత్‌నగర్

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

పై ప్రశ్నలకు తాడిగడప పురపాలకసంఘం కమిషనర్ భవానీ ప్రసాద్ సమాధానమిచ్చారు. – న్యూస్‌టుడే, కానూరు.

? వీరవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త, చెదారం గుట్టలుగా పేరుకుపోయి కన్పిస్తున్నాయి. **- రామారావు, వీరవల్లి**

✔ వెంటనే తగు చర్యలు తీసుకుంటాం
-శ్యామలరావు, పంచాయతీ ఈవో

– న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి కార్తీక మాసం పురస్కరించుకొని పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీస్ నడపనున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ బుధవారం తెలిపారు. ప్రతి ఆది, సోమవారాల్లో తెల్లవారుజామున 3 గంటలకు గన్నవరంలో బయలుదేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట శైవక్షేత్రాల్లో దర్శనం అనంతరం తిరిగి రాత్రికి గన్నవరం చేరుకుంటుందని చెప్పారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. 35 మంది ప్రయాణికులు ఒకే గ్రామం నుంచి ఉంటే నేరుగా గ్రామం నుంచే సర్వీస్ నడుపుతామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7382905633, 8790996090 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేడు గ్రామసభ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా గురువారం రంగన్నగూడెంలో గ్రామసభ నిర్వహిస్తున్నామని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.నాగభూషణం తెలిపారు. రైతులుసద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసు విధులపై అవగాహన

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : చట్టాల గురించి ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఎస్సై అర్జునరాజు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వల్లూరుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలు, పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. హెచ్ఎం రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు

వెలుగులు లేని బైపాస్ రహదారి



కంకిపాడు బైపాస్‌పై రెండున్నర కిలోమీటర్ల మేర గత కొన్ని నెలలుగా వీధి దీపాలు నెలలో వారం మాత్రమే వెలుగుతున్నాయి. ఈ సమస్య గత ఏడాదిగా తరచూ ఎదురవుతోంది. రెండు వైపులా సర్వీస్ రహదారులు, మూడు ఫ్లైఓవర్లు ఉన్నాయి. అంధకారం కారణంగా వాహనాలను గుర్తించలేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కంకిపాడు

క్లాప్ డ్రైవర్ల సమ్మెకు మద్దతుగా ర్యాలీ


కార్మికుల ప్రదర్శన

పోరంకి, న్యూస్‌టుడే: తాడిగడప మున్సిపాలిటీలో క్లాప్ డ్రైవర్లు 42 మంది చేపట్టిన సమ్మె బుధవారం 10వ రోజుకు చేరుకుంది. వారికి మద్దతు తెలుపుతూ పురపాలిక పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. క్లాప్ డ్రైవర్లతో కలిసి మున్సిపాలిటీ కార్యాలయం ముందు నిరసన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పాడ త్రిమూర్తులు, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు యనమల సరళ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కలుగజేసుకొని అధికారులతో, ప్రభుత్వంతో చర్చించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొండలు, రత్నకరుణ, విజయ, లక్ష్మి, మస్తాన్ వలి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

హద్దు దాటితే గల్లంతే..

పోలవరం కుడి కాల్వల్లో స్నానాలు | అప్రమత్తం కాకుంటే నష్టం


పోలవరం కాల్వలో దిగి చేపలు పడుతున్న యువకులు

న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్, గన్నవరం గ్రామీణం

● గత నెల మొదటి వారంలో బాపులపాడు మండలం వేలేరు వద్ద పోలవరం కుడి కాల్వలో గుర్తు తెలియని మృతదేహం కలకలం రేపింది. ఆ తర్వాత ఈ తరహా ఉదంతాలు మరో రెండు చోటుచేసుకున్నాయి. మృతదేహాలు వెలికితీయడం, వాటి ఆచూకీ గుర్తించడం పోలీసులకు కష్టంగా మారింది.

● గ్రామాలను ఆనుకుని, ప్రధాన రహదారులకు అతి సమీపంలో పోలవరం కుడి కాల్వ ఉండడంతో సరదాగా ఈతకు పశువులు మేపుతూ, చేపలు పట్టేందుకు తరచూ కాల్వలో దిగుతున్నారు. కాల్వ గట్టు, వంతెనల అంచులపై నిలబడి సెల్ఫీలు తీసుకునేందుకు దిగుతున్నారు. వీరిలో పలువురు గల్లంతై ప్రాణాలు కోల్పోతున్నారు.

● 2016 నుంచి గన్నవరం నియోజకవర్గ పరిధిలో పదుల సంఖ్యలో ప్రజలు పొరపాటున కాల్వలో గల్లంతవ్వగా, ఎగువ నుంచి అనేక మృతదేహాలు కొట్టుకు వచ్చాయి. ఈ ఏడాది కూడా పోలవరం కాల్వకు నీటిని విడుదల చేయడంతో ఈ తరహా అనర్థాలు పరిపాటిగా మారాయి.

పోలవరం కుడి కాల్వలో ఆదమరిచి దిగితే ఎంత ప్రమాదమో గత ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి. 119 కి.మీ వద్ద జిల్లాలో ప్రవేశించి 55 కి.మీ మేర ప్రవహించి వెలగలేరు వద్ద బుడమేరు మళ్లింపు కాలువ వద్ద కలుస్తున్న పోలవరం కుడి కాల్వ, రెండు నియోజకవర్గాల్లో అయిదు మండలాల మీదుగా ప్రవహిస్తోంది. 2015 నుంచి ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు ఈ కాల్వ ద్వారా కృష్ణా నదిలోకి చేరుతున్నాయి. వైకాపా అయిదేళ్ల పాలనలో సక్రమంగా నీటిని విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ఈ ఏడాది పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది.


వేలేరు వద్ద కాల్వలోకి దిగేందుకు ఏర్పాటు చేసిన అనధికారిక ర్యాంపు

ప్రవాహం ఇలా..

పోలవరం కుడి కాల్వ వెడల్పు 73 నుంచి 85 అడుగులు ఉంది. నీటి మట్టం ఎప్పుడూ 10 అడుగులకు పైగానే ఉంటుంది. గరిష్ఠంగా 8,500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

ప్రస్తుతం అయ్యప్ప దీక్ష సమయం ప్రారంభం కావడంతో దీక్ష స్వీకరించిన భక్తులు కాల్వ స్నానానికి పోలవరం కుడి కాల్వను ఎంచుకుంటున్నారు. కాల్వలో ప్రవాహం ఉన్న సమయంలో ప్రజల్ని అప్రమత్తం చేస్తూ నీటిపారుదల, రెవెన్యూ శాఖలు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసి, గ్రామాల్లో చాటింపు కూడా చేసేవారు. దాదాపు 50 మంది పర్యవేక్షణ ఉండేది. వైకాపా అయిదేళ్ల పాలనలో ఈ పర్యవేక్షణ, హెచ్చరిక వ్యవస్థ నాశనం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చినా ఈ తరహా కార్యాచరణ చేపట్టాలని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లా పరిధిలో పోలవరం కాల్వ చాలా భాగం కాంక్రీట్ లైనింగ్ జరగలేదు. దీంతో కాల్వ గట్టు అంచులు ప్రవాహ ఉద్ధృతికి కోసుకుపోయి, ఎవరైనా అక్కడ నిలబడితే జారి పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కంకిపాడు బీబీఆర్ నగర్‌లో అంతర్గత శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కంకిపాడు శివారు బీబీఆర్ నగర్‌లోని అంతర్గత రహదారి అభివృద్ధికి రూ.15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో శంకుస్థాపన చేశారు. నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, రాజా, సర్పంచి రమణ, వైస్ ఎంపీపీ కృష్ణకిషోర్, ఉప సర్పంచి ఆర్.చిరంజీవి, నాగేశ్వరరావు, వి.విక్రం, జయప్రకాష్, రోహిణీ కుమార్, కృష్ణమోహన్, వెంకట్, శివపార్వతి, స్వామి, శ్రీను తదితరులున్నారు.

మద్దూరులో 'పల్లె పండగ'

మద్దూరు (కంకిపాడు), న్యూస్‌టుడే : 'పల్లె పండగ'లో భాగంగా కేటాయించిన గ్రామీణ ఉపాధి హామీ నిధులతో మద్దూరులో చేపట్టిన సీసీ రహదారుల అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచులు చిప్పల రాందాస్ (మద్దూరు), పెద్ది వరప్రసాద్ (కాసరనేనివారిపాలెం), ఈవో చింతా కిరణ్‌కుమార్, మాజీ సర్పంచి వల్లె నరసింహారావు, వార్డు సభ్యుడు రావి శ్రీనివాస్, నాయకులు యనమదల మదన్, తీట్ల మధు, పామర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కానూరు, న్యూస్‌టుడే : కానూరు పరిధిలోని తులసీనగర్, వరలక్ష్మీపురం, పంట కాలువ రోడ్డులోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రహదారి అభివృద్ధి చేయాలని పాదయాత్ర

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొమటిగుంట-తెన్నేరు రహదారిని అభివృద్ధి చేయాలనే డిమాండ్‌తో సీపీఎం నాయకులు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. గోతులను పూడ్చి ఈ ప్రాంతంలోని ఐదు గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా చేయాలని వారు నిరసన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం పడినా ఈ రహదారిపై గోతులు కనిపించక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి రహదారిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.రంగారావు, నరేష్, సీహెచ్. శ్రీహరి, జె.రవి, ఏసు, బెనర్జీ, సుందరం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి



దరఖాస్తు ఫారం అందిస్తున్న మూల్పూరి కల్యాణి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గన్నవరం నియోజకవర్గ పరిధిలో ఉన్న పట్టభద్రులంతా తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలని రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి కల్యాణి విజ్ఞప్తి చేశారు. బుధవారం హనుమాన్‌జంక్షన్‌లో ఇంటింటికీ తిరుగుతూ ఓటు నమోదు దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. కూటమి తరపున ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారని, ఆయన గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. ఓటు నమోదులో ఎలాంటి సాయం కావాలన్నా తమను సంప్రదించాలని సూచించారు.

25 వరకు గడువు పొడిగింపు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఎస్సీ ఉచిత శిక్షణ పొందడానికి ఈ నెల 25 వరకు గడువును పొడిగించినట్లు ఉయ్యూరు సహాయ సంక్షేమాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తుల్ని జ్ఞానభూమి వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు ఆఖరు తేదీ ఈ నెల 21 కాగా దాన్ని 25కు మార్చడం జరిగిందని ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఘనంగా గజ్జెలపూజ మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే : తాడిగడప సాయిబాబా ఆలయం నేతృత్వంలో గజ్జెల పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కోలాటం, భజన కార్యక్రమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నిర్మించినా నిరుపయోగమే!


ప్రస్తుతం భవనాన్ని కప్పేస్తూ చెట్టుగా పెరిగిందిలా..

గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నామంటూ గత వైకాపా ప్రభుత్వం ఎంతో ఆర్భాటం చేసింది. రూ.16 లక్షల వ్యయంతో శాశ్వత భవనం నిర్మించే ప్రక్రియ ప్రారంభించారు. గన్నవరం నియోజకవర్గం బాపులపాడులో మొట్టమొదటి భవన నిర్మాణం పూర్తయింది. ఏడాదిన్నర కిందటే గ్రంథాలయ నిర్వహణకు వీలుగా భవనం సిద్ధమైనా ఇందులో సామగ్రి, పుస్తకాలు, కంప్యూటర్లు గానీ సమకూర్చకుండా వదిలేశారు. దీంతో భవనం చుట్టూ పొదలు, పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. కూటమి ప్రభుత్వం చొరవ చూపి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏడాది కిందట ఈ భవనం ముందు ఉద్భవించిన ఒక మొక్క, ప్రస్తుతం చెట్టు మాదిరి తయారై భవనాన్ని మూసేస్తూ పెరుగుతుండటం గమనార్హం.

– న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

పడితే ప్రమాదమే..


దంటగుంట్ల రోడ్డులో నివాసాలపై పడే స్థితిలో విద్యుత్తు స్తంభం


వీరవల్లిలో జాతీయ రహదారి వెంబడి పొలాల్లో ..

బాపులపాడు మండలంలో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. నివాసాలు, పొలాల్లో నేలవాలి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు సరఫరా జరిగేందుకు వీలుగా ఏర్పాటు చేసిన హైటెన్షన్ తీగలు ఈ స్తంభాలపైనే ఉండడంతో ఏదైనా పెను ప్రమాదం జరుగుతుందని కలవరపడుతున్నారు. సీపీడీసీఎల్ యంత్రాంగం సత్వరమే అప్రమత్తమై వీటిని బాగుజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం


గంగూరులో వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

గంగూరు(పెనమలూరు), న్యూస్‌టుడే: సార్వా పంట ధాన్యం కొనుగోలుకు గానూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధమవుతున్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి కనకమేడల శైలజ తెలిపారు. గంగూరు, యనమలకుదురుల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె ఆ శాఖ అధికారులతో కలిసి పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులు ధ్రువీకరణ పత్రాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు జమీలాఅంజుమ్, అహల్య తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అల్లాపురంలో రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భూ సమస్యల పరిష్కారంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ చిట్టిబాబు, ఏవో తేజస్వి ఇతర అధికారులు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి డొక్కు వెంకన్నబాబు, చిక్కవరపు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వరి పైరు పరిశీలన

తెన్నేరు/మారేడుమాక (కంకిపాడు), న్యూస్‌టుడే : ప్రస్తుత దశలో వరి పైరుపై పొడ తెగులు నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు స్వర్ణలత సూచించారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా బుధవారం తెన్నేరు, మారేడుమాక గ్రామాల్లో వరి పైరు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సూచనలు చేశారు. దీనిలో డీడీఏ జ్యోతిరమణి, ఏవోలు పద్మజ, పి.ఎం. కిరణ్, వీఏఏ శివకృష్ణ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలో చోరీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెరికీడు గ్రామ సచివాలయంలో చోరీ జరిగింది. బుధవారం ఉదయం 10 గంటలకు యథాప్రకారం విధులకు వెళ్లిన సిబ్బంది సచివాలయ ప్రధాన తలుపులకు వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై వి.సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది లోపలకు వెళ్లి పరిశీలించారు. సామగ్రి అంతా చెల్లాచెదురుగా చేసిన దుండగులు, రెండు ప్రింటర్లు, స్పీకర్లు అపహరించుకుపోయారు. దొంగల ఆచూకీ కనిపెట్టేందుకు వీలుగా మచిలీపట్నం నుంచి ఆధారాల సేకరణ బృందాన్ని రప్పించారు. ఆకతాయిలు రాత్రి సమయాల్లో మద్యం తాగుతున్నారని, దీనిని కట్టడి చేసేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఈ సందర్భంగా ఎస్సైకు విజ్ఞప్తి చేశారు.

సెలూన్ నిర్వాహకుడిపై దాడి

పెనమలూరు, న్యూస్‌టుడే: హెయిర్ కటింగ్ సెలూన్‌లో రాజకీయాలు మాట్లాడవద్దని చెప్పినందుకు నిర్వాహకుడిపై దాడి చేసి కొట్టిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. అన్నవరపు వీరరాజేష్ పెనమలూరు నివాసి. ఇతడు అదే గ్రామంలో హెయిర్ కటింగ్ సెలూన్ నిర్వహిస్తుంటారు. ఈనెల 22వ తేదీన కొలువుకంటి సుధీర్ దుకాణానికి వచ్చారు. అదే సమయంలో దుకాణం వద్ద ఉన్నవారితో రాజకీయాలు, పించన్ల గురించి మాట్లాడుతుండగా దుకాణ నిర్వాహకుడు జోక్యం చేసుకొని ఇక్కడ అలాంటివి మాట్లాడవద్దని చెప్పారు. దీంతో ఆగ్రహించిన సుధీర్ చేతి కడియంతో అతడిపై దాడి చేశారు. గాయాలపాలైన క్షతగాత్రుడు చికిత్స అనంతరం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా సుధీర్‌పై కేసు నమోదు చేశారు.

దాత వితరణతో అధునాతన గదులు

పోరంకి, న్యూస్‌టుడే



వైకాపా పాలనలో అసంపూర్తిగా ఆగిపోయిన తరగతి గదుల నిర్మాణ పనులు దాత అనుమోలు ప్రభాకరరావు వితరణతో చకచకా కొనసాగుతున్నాయి. పోరంకి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇరుకు గదుల్లో చదువులు కొనసాగిస్తున్నారు. నాడు-నేడు పనుల పేరుతో రూ.29 లక్షలు ఖర్చు చేసినప్పటికీ రంగుల హడావుడి తప్పితే పాఠశాల మౌలిక వసతులు కల్పించడంతో గత పాలకుల విధానాల డొల్లతనం స్పష్టంగా కనిపించింది. ఆర్ఎంఎస్ఏ నిధులతో చేపట్టిన తరగతి గదుల నిర్మాణ పనులను వైకాపా ఐదేళ్ల పాలనలో ఏమాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. దీంతో గత ఐదేళ్లుగా చాలీచాలని ఇరుకు గదుల్లో చదువులు కొనసాగించాల్సిన దుర్భర పరిస్థితులు పిల్లలు ఎదుర్కొన్నారు. అనుమోలు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అనుమోలు ప్రభాకరరావు దివంగతులైన తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 15 లక్షల వితరణతో చేపట్టిన అసంపూర్తి గదుల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. అధునాతన తరగతి గదులు 5 వరకు అందుబాటులోకి రానుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు అనుమోలు సేవలను ప్రశంసిస్తున్నారు.

పాఠశాల పేరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోరంకి
విద్యార్థుల సంఖ్య : 732
తరగతులు : 3 నుంచి 10 వరకు
సెక్షన్లు : 20 తరగతి గదులు : 16
అందుబాటులోకి రానున్నవి : 5

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

సృజనకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో గుడివాడ కోతి బొమ్మ సెంటర్ సాయి ఉషోదయ పబ్లిక్ స్కూలులో బుధవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగం, లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు శొంఠి కీర్తి ప్రియ, వేశపోగు విన్సీ, 9వ తరగతి విద్యార్థి కోలవెన్ను భార్గవీ ప్రియలు విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, కొల్లకూరి హరిప్రసాద్, ప్రధానోపాధ్యాయిని తుమ్మల రత్న, ఉపాధ్యాయిని వెంకటరమణలు బహుమతులు అందజేశారు.

- న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం



విజేతలతో సాయి ఉషోదయ పబ్లిక్ స్కూలు డైరెక్టర్ హరిప్రసాద్, ఉపాధ్యాయులు



వ్యాసం రాస్తున్న చిన్నారులు

వసతి గృహం తనిఖీ

నందివాడ (గుడివాడ గ్రామీణం), న్యూస్‌టుడే: నందివాడలోని బీసీ బాలుర వసతి గృహాన్ని గుడివాడ ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి పి.గాయత్రి బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులతో అక్కడ వారికి అందుతున్న వసతులపై ఆరా తీశారు. వార్డెన్ జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి గాయత్రి

మా ఇష్టం.. ఇక్కడే నిలుపుతాం!

పోలీసుల హెచ్చరికల బేఖాతర్ ● జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్య

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే

గుడివాడ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే రోడ్డులో నిలిపి వేస్తున్న లారీలతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. లారీలు బారులు తీరి ఉండగా మరో పక్క పైవంతెన నిర్మాణ పనుల కోసం మట్టి కొండలు ఉండడంతో నిత్యం ఆ మార్గంలో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పైవంతెన నిర్మాణం వల్ల పెదకాలువ సెంటర్ నుంచి బొమ్ములూరు మలుపు వరకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. దీంతో అక్కడ ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇరుకుగా ఉన్న ఈ రోడ్‌లో లక్ష్మీనగర్ కాలనీ వంతెన వద్ద నుంచి మార్కెట్ యార్డు మలుపు వరకు భారీగా లారీలు నిలిచి ఉంటున్నాయి. బందరు రోడ్డులో ఓ వైపు లారీలు బారులు తీరి ఉండగా మరోపక్క పైవంతెన నిర్మాణానికి భారీగా కొండల మాదిరిగా నిలువ ఉంచిన మట్టి ఉంటే వాహనాలు ఎలా ముందుకు సాగుతాయని వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు. అసలే రహదారి ఇరుకుగా ఉండడం దీనికితోడు రోడ్డు పక్కనే వాహనాలు నిలిపి వేయడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. లారీలు రోడ్లపై నిలుపు చేయకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. వీటిని నిలుపుదల చేసుకోవడానికి ప్రభుత్వం బందరు రోడ్డులోనే బొమ్ములూరు వద్ద లారీ స్టాండు ఏర్పాటు చేసినా లారీలను మాత్రం రహదారి పక్కనే నిలుపుదల చేస్తున్నారు. ఇవి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. జిల్లా ఎస్పీ గంగాధరరావు బుధవారం గుడివాడ బందరు రోడ్డు వైపు వచ్చారు. అయినా ఈ సమస్యను పరిశీలించకపోవడం గమనార్హం. బందరు రోడ్డులో లారీలు నిలుపు చేస్తే సహించబోమని గతంలో పోలీసులు ఎన్నో సార్లు హెచ్చరించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలో లారీలు నిలుపుదల చేయకుండా, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



బొమ్ములూరు మలుపు నుంచి బందరు రోడ్‌పై నిలిపిన లారీలు

రజిత సర్వాభరణం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండలంలోని వానపాములకు చెందిన వేదాంతం శాంతిప్రియ జ్ఞాపకార్థం భర్త మోహన్ ధన్వంతరి స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయానికి రూ.70వేల విలువైన రజిత సర్వాభరణాన్ని బుధవారం ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావుకు అందజేశారు. అర్చకులు మామిళ్లపల్లి చిదంబరం పాల్గొన్నారు

రేణుకా పరమేశ్వరునికి అన్నాభిషేకం

పామర్రు: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక కుమారి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రేణుకా పరమేశ్వరునికి బుధవారం అన్నాభిషేకం నిర్వహించారు. ప్రతినెల ఈ కార్యక్రమం చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వరదా అప్పారావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

పెదపారుపూడి, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి వి.సుజాత అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ సచివాలయాలలో కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా 10 గంటలకు బయోమెట్రిక్ వేయాలన్నారు.

రహదారుల మరమ్మతులకు ప్రతిపాదన

స్పందనకు వందనం

కొక్కిలిగడ్డ(మోపిదేవి), న్యూస్‌టుడే: మండలంలో అధ్వానంగా ఉన్న కొక్కిలిగడ్డ, బండికోళ్లంక రహదారులపై అధికారులు దృష్టి సారించారు. 'నడవడానికీ కష్టమే' శీర్షికన ఈ నెల 20న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన పంచాయతీరాజ్ డీఈ సురేష్, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు ఫణి ఆయా రోడ్ల క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. దాదాపు 2 కిలోమీటర్లు ఉన్న కొక్కిలిగడ్డ రహదారికి అభివృద్ధికి రూ.60 లక్షలు, కొక్కిలిగడ్డ-బండికోళ్లంక 850 మీటర్లు ఉన్న రహదారి అభివృద్ధికి రూ.30 లక్షల వరకు నిధులు అవసరమని ప్రతిపాదించారు. వీటిని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ దృష్టికి సమర్పించి నిధులు మంజూరుచేయాలని కోరనున్నట్లు డీఈ సురేష్ పేర్కొన్నారు.



కొక్కిలిగడ్డ రోడ్డును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ ఏఈలు

కూటమి ప్రభుత్వంతో సుపరిపాలన

పెదమద్దాలి (పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే: గత వైకాపా పాలకులు ప్రజావనరులను పట్టించుకోకుండా స్వలాభం కోసం పనిచేయడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా విమర్శించారు. బుధవారం మండలంలోని పెదమద్దాలి పల్లె పండుగలో భాగంగా 14 సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత గతి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. ఈ గ్రామంలో రూ.53.5లక్షల ఉపాధి నిధులతో 14 సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. సర్పంచి శాంతకుమారి, రాజ్యలక్ష్మి, తాడిశెట్టి నరేష్, వల్లూరుపల్లి గణేష్, కొల్లివడ ప్రభాకర్, వీరమాచనేని వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జ్యోతి, పీఆర్ ఏఈ రామారావు, పెద్దమద్దాలి తెదేపా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ఎమ్మెల్సీ ఓటర్ల దరఖాస్తుల స్వీకరణ

చల్లపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన ఓటు నమోదులో చల్లపల్లిలోని ప్రైవేటు విద్యాసంస్థల నుంచి 200 దరఖాస్తులు అందినట్లు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు శివ తెలిపారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల త్యాగాలు ఎనిలేనివని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గుడివాడ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామపురంలోని వెలమ సంక్షేమ సంఘ కమ్యూనిటీ హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు తమ ప్రాణాలొడ్డి మరీ పని చేస్తారని అన్నారు. గుడివాడ వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్, ఖోఖో కోచ్ మడకా ప్రసాద్, సామాజికవేత్త రామకృష్ణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవిరి శంకర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



గుడివాడ గ్రామీణం: రక్తదాన శిబిరంలో జిల్లా ఎస్పీ గంగాధరరావు తదితరులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మోటూరులో డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గుడివాడ తాలూకా ఎస్ఐ చంటిబాబు తదితరులు పాల్గొన్నారు. తాలూకా పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్‌లో భాగంగా ఏజీకే ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధులు గూరించి ఎస్ఐ వివరించారు

రెండు వేల మందికి అన్నసమారాధన

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం రైల్వేస్టేషన్ వద్ద 31వ వార్డులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, తెదేపా నేతలు బొంబాయి శ్రీను, మిక్కిలినేని రమేష్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బొమ్ములూరు యాదవ సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనను మాజీ ఎంపీపీ గుత్తా శిరామకృష్ణ(చంటి) ప్రారంభించారు.



అన్నదానంలో భోజనం వడ్డిస్తున్న యలవర్తి శ్రీనివాసరావు. తదితరులు

బాధిత కుటుంబానికి సాయం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కోడూరు మండలం, నక్కవానిదారి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో వీరబాబు సర్వం కోల్పోయారు. అతని కుమారుడు లోకేష్ చదువుతున్న ఎస్వీఎల్ క్రాంతి కళాశాల విద్యార్థులు విషయం తెలుసుకుని రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సీఐ యువకుమార్, కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావుల చేతుల మీదుగా నగదు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి లోకేష్‌కు కళాశాల ఫీజులో రూ.30 వేలు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చోరగుడి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: విజిలెన్సు వారోత్సవాల సందర్భంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కృష్ణాపురం శాఖ ఆధ్వర్యంలో బుధవారం చోరగుడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ తాతాజీ, చీఫ్ మేనేజరు విజిలెన్సు వెంకటరాజు బహుమతులు అందజేసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కృష్ణాపురం యూనియన్ బ్యాంకు మేనేజరు ఆర్ రాకేష్, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కొడాలికి జన్మదిన వేడుకలు గుడివాడకు అవమానం'

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడలో ప్రజలను కొడాలి నాని ఐదు రకాలుగా మోసం చేసి సర్వనాశనం చేస్తే ఆయనకు జన్మదిన వేడుకలు చేయడం గుడివాడకు అవమానం జనసేన నేత పాలంకి సారథిబాబు విమర్శించారు. బుధవారం గుడివాడలో తన నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా భూకబ్జాలు, ఇసుక, క్యాసినోలు, రేషన్ బియ్యం స్కామ్, మట్టి మాఫియా చేసి గుడివాడ మాయని మచ్చ తెచ్చారని మండిపడ్డారు. తాను ఇటీవల యూరప్ వెళితే అక్కడ కూడా తాను గుడివాడ వాసిని అని చెప్పగానే బూతుల మంత్రి నియోజకవర్గమా? అని అడిగారంటే పరిస్థితి ఊహించుకోవచ్చన్నారు.

16, 17 తేదీల్లో ఈషా గ్రామోత్సవం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : మన సంప్రదాయ గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్న తరుణంలో... వాటిని పరిరక్షించేందుకు ఈషా ఔట్‌రీచ్ 16వ వార్షిక గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కార్యక్రమాల సమన్వయకర్త జి.శివలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా నవంబరు 16, 17 తేదీల్లో అవనిగడ్డ ప్రభుత్వ కళాశాల మైదానంలో వాలీబాల్ (పురుషులు), త్రోబాల్ (మహిళలు) పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనేవారు isha.co/grm-regs లో, లేదా 83000 30999 నంబరుకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

మహిళల ఆర్థిక ప్రగతే చంద్రన్న లక్ష్యం

గుడివాడ గ్రామీణం: రాష్ట్రంలో మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పురపాలక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజారును మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కమిషనర్ బి.శ్రీనివాసరావులతో కలిసి రావి ప్రారంభించారు. జనసేన బాధ్యుడు శ్రీకాంత్, కొడాలి రామరాజు, వాసే మురళీ, రమేష్ చౌదరి, మెప్మా అధికారులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కోసూరు విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ



మొవ్వలో..



లింగారెడ్డిపాలెంలో..

కోసూరు (కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం కోసూరు, మొవ్వ జడ్పీ పాఠశాలల నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మంగళవారం జగ్గయ్యపేట బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్‌గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక జరిగింది. కోసూరుకు చెందిన చౌటపల్లి నమ్రత, బి. ప్రభుకుమార్‌లు అండర్ 14 విభాగంలో ఎంపికయ్యారు. మొవ్వ శ్రీమండవ కనకయ్య జడ్పీ పాఠశాలకు చెందిన ప్రదీప్‌కుమార్ అండర్ 14, 17 విభాగంలో యోగీశ్వర్‌లు ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పసుపులేటి శివకోటేశ్వరరావు, పాఠశాల ఎస్‌ఎంసీ ఛైర్మన్ బాబూరావు, పాఠశాల కో-ఆప్షన్ సభ్యురాలు అమ్మిణి, పీడీ రామారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు నవంబరు 9, 10, 11 తేదీల్లో అండర్ 14 విభాగంలో బాపట్ల జిల్లా పిట్లవానిపాలెంలోను, అండర్ 17 విభాగంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో పోటీలు జరుగుతాయని చెప్పారు.

కోడూరు (అవనిగడ్డ): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలకు మండల పరిధిలోని లింగారెడ్డిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు ఐదుగురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని నాగ రత్నకుమారి తెలిపారు. జగ్గయ్యపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 22వ తేదీన జరిగిన అండర్ 17 కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబరిచిన పి.మధుప్రియ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని తెలిపారు. ఈ నెల 20న గుడివాడలో జరిగిన అండర్ 16 విభాగం ఖోఖోలో పాల్గొన్న బి.దివ్య, పి.మధుప్రియ, లావణ్య, డి.నాంచారమ్మ, బి.మహేశ్వరి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే 43వ జూనియర్ ఛాంపియన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వెల్లడించారు. విద్యార్థినులను పీఈటీ ప్రసాద్ అభినందించారు.

మద్యం దుకాణానికి అనుమతులు ఇవ్వొద్దు

రామానగరం (చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరంలో హిందూ శ్మశానవాటిక ఆవరణలో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దంటూ మహిళలు తహసీల్దార్ కార్యాలయం వద్ద డీటీ శ్రీలతకు వినతిపత్రాన్ని బుధవారం అందించారు.

ఘంటసాల (అవనిగడ్డ గ్రామీణం): మల్లంపల్లిలో జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసే మద్యం దుకాణాన్ని నిలిపివేయాలని ఆ ప్రాంత మహిళలు డిప్యూటీ తహసీల్దారు కనకదుర్గకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లు కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గోపికృష్ణ ఫంక్షన్ హాలులో జరిగిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

పామర్రు, న్యూస్‌టుడే: రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రధాన భూమిక పోషిస్తుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాబ్జి అన్నారు. బుధవారం స్థానిక శివరామా సినీ థియేటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి పార్టీ నాయకులంతా కలిసి పనిచేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని విమర్శించారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలి

చల్లపల్లి: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని రక్షణ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎం.బాలలత అన్నారు. బుధవారం చల్లపల్లిలోని చంద్రరాజేశ్వరరావు వికాస కేంద్రంలో శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల, విజయ జూనియర్ కళాశాలల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్ ఆధ్వర్యంలో 'విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు-లక్ష్యాల సాధన' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలలత మాట్లాడుతూ సాధారణ స్థాయి నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లు సాధించిన యువత జీవితగాథలు తెలియజేసి వారిని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. తొలుత బాలలతను శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల, విజయ జూనియర్ కళాశాలల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్ సత్కరించారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, సర్పంచి కృష్ణకుమారి, కళాశాలల ప్రిన్సిపాళ్లు పెమ్మసాని రమేష్‌బాబు, అబ్దుల్ రహీం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




బాలలతను సత్కరిస్తున్న యార్లగడ్డ శివప్రసాద్, తదితరులు

స్ఫూర్తిదాయకమైన మహిళ బాలలత.. : అచంచలమైన అంకితభావం, ఆత్మవిశ్వాసంతో విజయవంతమైన జీవన ప్రయాణం సాగిస్తున్న రక్షణశాఖ మాజీ అధికారిణి బాలలత దేశంలోనే స్ఫూర్తిదాయకమైన మహిళ అని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. బుధవారం చల్లపల్లికి వచ్చిన బాలలతను సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

అమృత్ అవార్డు గ్రహీత కన్నుమూత

బాపట్ల, న్యూస్‌టుడే : బాపట్లకు చెందిన కూచిపూడి నాట్య కళాకారుడు మహంకాళి శ్రీమన్నారాయణ (84) పట్టణంలోని తూర్పుసత్రం వద్ద గల నివాసంలో బుధవారం కన్నుమూశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆరు నెలల క్రితం శ్రీమన్నారాయణకు అమృత అవార్డు ప్రదానం చేసింది. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ చేతులమీదుగా దీనిని అందుకున్నారు. కూచిపూడికి చెందిన సత్యనారాయణ, కామాక్షమ్మలకు శ్రీమన్నారాయణ జన్మించారు. 18వ ఏట బాపట్లకు వచ్చి స్థిర పడ్డ ఆయన శ్రీకృష్ణుడిగా, సూత్రధారిగా, మాతంగ కన్యలుగా, శ్రీ సత్య హరిశ్చంద్రంలో లోహితాక్షుడుగా అంచెలంచెలుగా యక్షగాన చక్రవర్తిగా పేరు పొందారు. కూచిపూడి నాట్య కళలో దాదాపు 30వేల మందికి పైగా శిష్యులను తయారు చేశారు. ఆయన శిష్యురాలైన రమాదేవి హైదరాబాద్ కేంద్రంగా కూచిపూడి నాట్య అకాడమీ స్థాపించి రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష సేవలందిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా పెద్దకుమారుడు వెంకటరామకృష్ణ కూచిపూడి నాట్యంలో పలు ప్రదర్శనలు చేశారు.



శ్రీమన్నారాయణ (పాతచిత్రం)

కె.కొత్తపాలెంలో నీటి ఎద్దడి

కె.కొత్తపాలెం(మోపిదేవి), న్యూస్‌టుడే:

కె.కొత్తపాలెం కరకట్ట కింద నివసిస్తున్న దాదాపు 270 కుటుంబాలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. అక్కడ నిర్మించిన రక్షిత మంచినీటి పథకం కొన్నేళ్లుగా పనిచేయడం లేదు. అప్పటి వైకాపా ప్రభుత్వం ఈ సమస్యను విస్మరించడంతో అక్కడ స్థానికులకు చేతి పంపునీరే శరణ్యమయ్యింది. అప్పటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఈ సమస్యను గడప గడపకు మన ప్రభుత్వంలో విన్నవించినా పరిష్కరించలేదు. నిధులు లేవనే సాకుతో పూర్తిగా గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ దృష్టికి తీసుకు వచ్చారు. గత నెలలో కృష్ణా నదికి వరదలు రావడం ఇళ్లన్నీ మునిగాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వరద ముంపు గ్రామంగా గుర్తించి రూ.లక్ష గ్రాంటు ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కె.కొత్తపాలెం ఎస్సీవాడలో ఏళ్లుగా పనిచేయని మంచి నీటి పథకం

స్వల్పకాలిక పంటల వైపు దృష్టి

- ప్రభుత్వ భరోసాతో కర్షకుల సాగుబాట
- బెండ, మినుము, బంతిపూల సాగుకు ప్రాధాన్యం

మోపిదేవి, న్యూస్‌టుడే

కృష్ణా నదికి గత నెలలో వచ్చిన అధిక వరదలకు రైతులు వాణిజ్య, ఉద్యాన పంటలతో పాటు పెట్టుబడి అంతా కోల్పోయారు. ప్రభుత్వం తొందరలో పరిహారం అందించి, మేమున్నామంటూ భరోసా ఇవ్వడంతో కర్షకులు మళ్లీ సాగుబాట పట్టారు. వాణిజ్య పంటలకు అదను దాటిపోవడంతో వాటి స్థానంలో మూడు నెలలకు దిగుబడి వచ్చే మినుము, బెండ, బంతిపూలు, పెసర, నువ్వులు సాగు చేపట్టారు. కోసూరుపాలెంలో రైతులు మల్చర్ పద్ధతిలో బంతిపూలు, టమోటా వేశారు. మెట్ట ప్రాంతాల్లో మినుముకు గిరాకీ ఉంటుంది. వరి కోతల అనంతరం మార్చిలో మాగాణి భూముల్లో పంట చేతికొస్తుంది. కానీ మెట్ట భూముల్లో జనవరి నెలకే చేతికొస్తుంది. ధర కూడా ఆశాజనకంగా ఉంటుంది. వరదల వల్ల ఒండ్రుమట్టి మేట వేసింది. ఇది చేను, పైరు ఏపుగా పెరిగేందుకు దోహదం చేస్తుంది.



ఏపుగా పెరుగుతున్న మినుము పైరు

బెండ సాగు చేపట్టా



పసుపు పంటతో చాలా నష్టం వచ్చింది. పరిహారం వచ్చింది. భూమి దున్ని బెండ గింజలు నాటా. 25 రోజుల వయసుంది. ప్రస్తుతం దీనికి మంచి ధర పలుకుతోంది. హైబ్రిడ్ విత్తనం కావడంతో కాపు మరో 15 రోజుల్లో ప్రారంభమవుతుంది. ప్రభుత్వం పంట నష్ట పరిహారం కేవలం 20 రోజుల్లోనే అందించిన కారణంగా తిరిగి ఈ సాగు చేపట్టగలిగాను **- మోర్ల వెంకటేశ్వరరావు(పెదప్రోలు)**

మూడు నెలల్లో దిగుబడి



బొప్పాయి తోట పూర్తిగా కోల్పోయా. కంద కూడా నష్టపోయా. వాటిని తొలగించి భూమి సిద్ధం చేసి టమోటా నాటా. వాతావరణం అనుకూలంగా ఉంటే మూడు నెలలకు దిగుబడినిస్తుంది. నష్టాన్ని భర్తీ చేసుకోవాలంటే తక్కువ సమయంలో పంట చేతికొచ్చే వాటిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. **- బోగిరెడ్డి సాంబశివరావు(కోసూరుపాలెం)**

కరకట్టపై అపస్మారక స్థితిలో యువకుడు

హోటల్ యజమాని దాడి చేశారని అనుమానం

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తుంగలవారిపాలెం సమీపంలోని కరకట్టపై బుధవారం సాయంత్రం గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న యువకుడిని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై కె.శ్రీనివాసరావు చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. తుంగలవారిపాలెంకు చెందిన భోగిరెడ్డి నాగరాజు గుంటూరులోని ఓ కిచిడీ హోటల్ కొంతకాలంగా పనిచేస్తున్నాడు. యజమానులు జీతం ఇవ్వకపోవడంతో నాగరాజు పనిమానేసి స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం జీతం కోసం తాను పనిచేసిన హోటల్‌కు వెళ్లి అడగ్గా వారు దాడి చేసి గాయపర్చి తుంగలవారిపాలెం సమీపంలోని కరకట్ట మీద పడేసి వెళ్లిపోయారు. వివరాలను నమోదు చేసి గుంటూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.



చికిత్స పొందుతున్న నాగరాజు

26న పోతేపల్లిలో ఉద్యోగ మేళా

పోతేపల్లి (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న బందరు మండలం పోతేపల్లి జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కులో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా. వి. నరేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేళాలో వీటీకే గోల్డ్ కవరింగ్ వర్క్స్, సాగర్ గోల్డ్ కవరింగ్ వర్క్స్, ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపువారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు రూ.8వేల నుంచి రూ.20వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99664 89796 నంబరును సంప్రదించాలన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.7.36 లక్షలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక గ్రామదేవత లంకమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. రూ.7,36,477ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో వై. శ్రీనివాసరావు చెప్పారు. 5 నెలల 20 రోజులకు వచ్చిన ఆదాయమని తెలిపారు.

అంగన్‌వాడీలకు అదనపు హంగులు

- కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'సక్షం' అమలు
- జిల్లాలో 743 కేంద్రాల ఎంపిక

పామర్రు గ్రామీణం, కానూరు, న్యూస్‌టుడే

ఆరోగ్యం, ఆనందకరమైన బాల్యానికి చేయూత నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ సక్షం పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటి వరకు అందుతున్న సౌకర్యాలకుతోడు అదనపు హంగులు జోడించనున్నారు. ఈ కేంద్రాల్లోనే తాజా పండ్లు, ఆకు, కాయగూరలకు న్యూట్రీ గార్డెన్, ఇంకుడు గుంతల ఏర్పాటు, ఆట పరికరాలు తదితర సదుపాయాలు సమకూర్చుతారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించింది.

కృష్ణా జిల్లాలోని 8 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,707 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు 38,888 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు 15,795 మంది చిన్నారులున్నారు. గర్భిణులు 7,266, బాలింతలు 6,889 మందిగా లబ్ధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లల మానసిక వికాసాన్ని కాంక్షించి, వాన నీటిని ఒడిసి పట్టేందుకు చర్యలు చేపడుతూ సక్షం(ఎస్ఏకేఎస్‌హెచ్ఏఎం)(స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టైయినబుల్ హెల్త్ మేనేజ్) పథకం అందుబాటులోకి తేవాలని సంకల్పించింది.

ప్రాజెక్టు	ఎంపికైన కేంద్రాలు
అవనిగడ్డ	61
బంటుమిల్లి	94
గన్నవరం	123
గుడివాడ	80
కంకిపాడు	92
మచిలీపట్నం	70
మొవ్వ	134
పామర్రు	89


చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న కార్యకర్త

ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే 743 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి ఈ పథకాన్ని ఈ నెల నుంచే అమల్లోకి తెచ్చింది.

ప్రతి కేంద్రానికి రూ.45,800 కేటాయింపు

న్యూట్రీగార్డెన్, ఇంకుడు గుంతల ఏర్పాటు, నిర్వాహణ, చిన్నారుల ఆటలకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.45,800 కేటాయించారు. ఇందులో న్యూట్రీగార్డెన్‌కు రూ.10 వేలు, ఇంకుడు గుంతలకు రూ.16 వేలు, ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.19,800 వెచ్చిస్తారు. ఇలా జిల్లాలో సక్షం పథకానికి ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ.3,40,29,400 నిధులు ఇప్పటికే మంజూరు చేసింది.




పథకాన్ని సమర్థంగా అమలు చేస్తాం

కృష్ణా జిల్లాలో సక్షం అమలుకు 743, ఎన్టీఆర్ జిల్లాలో 440 కేంద్రాలను ఎంపిక చేశాం. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కృష్ణా జిల్లాకు రూ.3.40కోట్లు, ఎన్టీఆర్ జిల్లాకు రూ.2.01కోట్లు కేటాయించింది. ఈ నిధులతో కేంద్రాలకు కావాల్సిన అన్ని వసతులు సమకూర్చి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. ఈ పథకాన్ని పక్కాగా అమలు చేస్తాం. న్యూట్రీగార్డెన్లు సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకుంటాం. **- ఎస్.సువర్ణ, జి.ఉమాదేవి, ఐసీడీఎస్, పీడీలు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా**

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యం

చిట్టిపాలెం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం కృష్ణా మిల్క్ యూనియన్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం బందరు మండలం చిట్టిపాలెం, గంటలమ్మపాలెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాలను ఆంజనేయులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారులను ఉద్దేశించి ఆంజనేయులు మాట్లాడుతూ.. కల్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభ, యాక్సిడెంట్ కేర్ ట్రస్ట్ పథకాల గురించి వివరించారు. పాడిపశువులకు అందించే పశుబీమా, డీవార్మింగ్, పశుదాణా, కాల్షియం, మినరల్ మిక్సర్ వాడడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. యూనియన్ ద్వారా అందించే వీర్యం ద్వారా పుట్టిన దూడలు భవిష్యత్తులో ఎక్కువ పాల చార కలిగిన పశువులుగా రైతులకు అధిక లాభాలు ఆర్జించి పెడతాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ పాలకవర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ లింగం ప్రసాద్, గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు చండిక నాగబాబు, చండిక విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో చలసాని ఆంజనేయులు

భూసమస్యలకు సకాలంలో పరిష్కారం

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: భూసమస్యలపై వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించి రెవెన్యూ వ్యవస్థపై సానుకూలత కలిగించేలా కృషి చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి మీకోసం అర్జీలతో పాటు నీటి తీరువా పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల్లో ఎక్కువగా రెవెన్యూకు సంబంధించినవి ఉంటున్నాయని, వాటిని సకాలంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి కార్యాలయాల నుంచి వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. తహసీల్దారులు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లు సరిగా ఉన్నాయా లేదా పరిశీలించాలని ఆర్డీవోలకు సూచించారు. గతంలో సూచించిన విధంగా గ్రామాల వారీ గ్రీవెన్స్ ప్రొఫైల్ సరిగా తయారు చేయకపోవడంతో తహసీల్దార్లపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల తేదీలను ఎప్పుడైనా ప్రకటించవచ్చని, అందరూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలని, అనధికార లేఔట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావులు వివిధ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కేఆర్‌సీసీ ప్రత్యేక ఉప కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవోలు బాలసుబ్రహ్మణ్యం, షారోన్, కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జేసీ, డీఆర్వో

కోర్టు కేసులపై దృష్టి

జిల్లాలో భూసమస్యలకు సంబంధించిన కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధి పనులకు కేటాయించిన భూముల్లో పనులు ప్రారంభించకపోతే తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ మాట్లాడుతూ నవంబరు రెండో వారం నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ ఖరీఫ్‌లో 9.8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 302 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపడతామని తెలిపారు. డీఎస్‌వో పార్వతి, పౌరసరఫరాల సంస్థ డీఎం సృజన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరో 20 ఏళ్లు కూటమి పొత్తు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కూటమి ఐక్యత మరో 20 ఏళ్లు కొనసాగుతుందని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సర్వ సభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కూటమి 20 ఏళ్లు కొనసాగుతుందని చెప్పారని గుర్తు చేశారు. పార్టీ అధిష్ఠానం కార్యకర్తల శ్రేయస్సు కోసం వారికి బీమాతో కూడిన సభ్యత్వ సౌకర్యం కల్పిస్తోందన్నారు. జిల్లాలో అవనిగడ్డ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచేలా సభ్యత్వ నమోదు చేయాలని పిలుపు ఇచ్చారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా మండల పార్టీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లాలని, పరిష్కారం కాకపోతే తన దృష్టికి, లేదా నియోజకవర్గ పరిశీలకుని దృష్టికి తీసుకు రావాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి నియామకం విషయంలో పార్టీ శ్రేణులు తొందరపడ వద్దని ఆయన సూచించారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైకాపా పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న వారికి చట్ట ప్రకారం శిక్షపడుతుందన్నారు. తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మాచవరపు ఆదినారాయణ, ఎంపీపీలు రావి దుర్గావాణి, విజయ రాధిక, తుమ్మల చౌదరిబాబు, మెండు లక్ష్మణరావు, మోర్ల రాంబాబు, నడకుదిటి జనార్దన్‌రావు, కర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు

చోరీ కేసులో నిందితుడికి కఠిన కారాగారం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: చోరీకి పాల్పడిన కేసులో నిందితుడికి కఠిన కారాగారం, జరిమానా విధిస్తూ గన్నవరం కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గన్నవరం పట్టణ శివారు దావాజీగూడెం శివాలయం అచ్చుకుడిగా పని చేస్తున్న చావలి మురళీకృష్ణ శర్మ ఆలయ సమీపంలోనే నివసిస్తున్నాడు. ఈ ఏడాది జులై 22న దేవాలయంలో పూజల అనంతరం ఇంటికి వచ్చిన ఆయన టిఫిన్ కోసం తాళం వేసి బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి రాగా.. తలుపులు గడియ తెరచి ఉండడంతో చోరీ జరిగిందని భావించాడు. లోపలికి వెళ్లి చూడగా.. 35 గ్రాముల బంగారం, కేజీన్నర వెండి ఆభరణాలు, వస్తువులతో పాటు రూ.30 వేల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో నిందితుడు గుడివాడ కొత్తపేటకు చెందిన ముద్దాని జగదీష్ (రాజు)గా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని స్థానిక 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. గతంలో ఉంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసుల్లో కూడా ముద్దాయిగా ఉన్న జగదీష్‌పై నేరం నిరూపణ కావడంతో ఒక్కొక్క కేసులో రెండేళ్ల పాటు కఠిన కారాగారం, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఏపీపీ టి.మాధవి వాదనలు వినిపించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో చోదకుడి మృతి

నిడుమోలు(కూచిపూడి), న్యూస్‌టుడే: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ముద్దిరావమ్మ గుడి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రక్కు ఆటో చోదకుడు సంకాబత్తిన సన్యాసిరావు (55) మృతి చెందారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వెళుతున్న ఈ వాహనాన్ని మినీలారీ ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. చోదకుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కూచిపూడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా పోరాటాలతో ప్రతిపక్ష పాత్ర

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిపక్షంలో ఉన్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేసుల భయంతో ప్రజా సమస్యలు లేవనెత్తలేని పరిస్థితుల్లో ఉన్నారని, కాబట్టి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలతో ప్రతిపక్ష పాత్ర పోషించాలని పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం నూజివీడు అమర్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి డి.హరినాథ్ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శంకర్‌తో పాటు రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావులు హాజరయ్యారు.

అంతర పంటతో ప్రయోజనాలు మెండు

కంచికచర్ల, వీరులపాడు, న్యూస్‌టుడే

రైతేరాజు

విభిన్న పద్ధతులు ఆచరిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకుంటున్నారు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన రైతు వెంపటి రాజశేఖర్. 4 ఎకరాల పొలంలో మామిడి, జామ మొక్కలు నాటిన అతను పంట కాలం వృథా కాకుండా... ఖరీఫ్ సీజన్‌లో సాళ్ల మధ్య పెసర పైరు వేశారు. వరదల కారణంగా కొంత పంట నష్టపోయినప్పటికీ నిరాశ చెందలేదు.



తోటలో కలుపు మొక్కలు ఏరుతున్న రైతు రాజశేఖర్

పెసర కోత అనంతరం పండ్ల మొక్కల మధ్యలో కూరగాయలు సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు పొలాన్ని సిద్ధం చేసి మొక్కల మధ్య ఖాళీల్లో టమాటా మొక్కలు నాటారు. నాలుగెకరాల పండ్ల తోటలో టమాట సుమారు ఒక ఎకరాలో పండిస్తున్నారు. టమాటా సాగు చేయడానికి అతను ప్రత్యేకంగా ఖర్చు పెట్టింది కేవలం రూ.15 వేలు మాత్రమే.

పెట్టుబడి తక్కువ..

టమాట ఎత్తు పెరిగిన తరువాత సాళ్ల మధ్యలోని ఖాళీ స్థలంలో ఇతర కాయగూరల సాగు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. పండ్ల తోటలో అంతర పంటల వల్ల సాగు ఖర్చు సగానికి సగం తగ్గుతుందని ఆయన వివరించారు. పండ్ల మొక్కలకు పురుగు, చీడపీడలు ఆశించకుండా వాడే రసాయనాలే కాయగూరల మొక్కలకు సరిపోతాయని, వాటికి ప్రత్యేకంగా పిచికారీ చేసే పని ఉండదని చెబుతున్నారు. పండ్ల మొక్కలకు అందించే నీరే కాయగూరలకు సరిపోతుందని, వాటికి వేసిన ఎరువులే కాయగూరలకు పనికి వస్తాయని వివరించారు. పెట్టుబడి తక్కువ దిగుబడి అధికంగా వస్తుందని చెప్పారు. అంతర పంటలను ప్రతి సీజన్‌కు మార్చి మార్చి వేయడం ద్వారా పండ్ల తోటల్లో వచ్చే చీడపీడలకు కూడా అడ్డుకట్ట వేయవచ్చని వివరించారు. ఒకే పంట కాలంలో విభిన్న పంటలు సాగు చేస్తూ సహచర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

రైతు ప్రశ్న నిపుణుల జవాబు

ప్రశ్న: వంగ పంటకు అనువైన నేలలు, విత్తే కాలం, విత్తన మోతాదు గురించి వివరించండి?

– ఎన్.రంగారావు, రైతు, మల్లంపల్లి

సమాధానం: వంగ ఉష్ణ మండల పంట. నీటి ఎద్దడి తట్టుకోగలదు. సారవంతమైన, మురుగు నీరు పోయే అన్ని రకాల నేలలు సాగుకు అనుకూలం. నేల ఉదజని సూచిక 5.5-6.5 మధ్య ఉంటే మేలు. ఏడాది పొడవునా పండించవచ్చు. అక్టోబరు, నవంబరు నెలల్లో విత్తితే మరింత అనుకూలం. ఎకరానికి సూటి రకాలైతే 260 గ్రా., సంకర రకాలైతే 124 గ్రాముల విత్తనం సరిపోతుంది. నారుమడిలో విత్తు వేసి దాదాపు 30-35 రోజుల వయసు గల మొక్కలను ప్రధాన పొలంలో నాటుకోవాలి. గుబురు రకాలైతే 50×50 సెం.మీ. ఎడంతో నాటుకోవాలి.

– వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం

- న్యూస్‌టుడే, ఘంటసాల

మినుముకు ఆశించే పురుగులు.. నివారణ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే



మారుకా మచ్చల పురుగు

ప్రస్తుతం కొందరు రైతులు మినుము పంట సాగు చేస్తున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల్లో పైరుకు ఆశిస్తున్న పురుగులు, నివారణ చర్యల గురించి ఏవో నాగేశ్వరరావు వివరించారు.

మారుకా మచ్చల పురుగు: ఇది పైరుకు ఆశిస్తే మొగ్గ, పూత, పిందె దశల్లో ఆకులను జల్లెడలా చేసి నష్టం పరుస్తుంది. పూత దశలో పూలను గూడుగా చేసి లోపల పదార్థాన్ని తింటుంది. కాయలు తయారయ్యేటప్పుడు రంధ్రం చేసి లోపల గింజ తిని నష్టం కలుగజేస్తుంది. **నివారణ:** పురుగు ఉద్ధృతి అధికంగా ఉంటే స్పైనసాడ్ 0.3 మి.లీ., లేదంటే ఎమామెక్టినబెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రైనాక్సిపిరే 0.3 మి.లీ., ఫ్లూబెండమైడ్ 0.2 మి.గ్రా. లీటరు నీటిలో కలిపి చల్లటి వేళ పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

కాండపు ఈగ: ఇది కాండంలో చేరి తినడం వల్ల మొక్క ఎండిపోతుంది. ఎక్కువగా తొలకరి పైరుపై ఆశిస్తుంది.

నివారణ: ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఆకుపచ్చ తెగులు: ఈ తెగులు సోకిన ఆకులపై చిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. అనుకూల వాతావరణంలో వలయాకారంగా మారి ఆకులు ఎండి రాలిపోతాయి.

నివారణ: లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

తుపాను వేళ.. పశు సంరక్షణ ఇలా..

కంకిపాడు, న్యూస్‌టుడే

రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో భారీ వర్షాలు పడి... వరద ముంచుకొస్తే పశు సంరక్షణకు పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశువైద్యాధికారి కె.మాధవరావు వివరించారు.

విపత్తుకు ముందు.. విపత్తు ప్రాంతంలో తాము ఉన్నదీ.. లేనిదీ నిర్ధారించుకోవాలి. అధికారుల సూచనల మేరకు అప్రమత్తం కావాలి. పశువును వరద ప్రాంతానికి దూరంగా ఉంచాలి. తాళ్లు, దాణా, పచ్చి/ఎండు గడ్డి, ప్రాథమిక చికిత్స ఔషధాలు, బీమా పత్రాలు, బకెట్లు, టార్చిలైట్, దుప్పట్లు తదితరాలతో కూడిన కిట్టును సిద్ధం చేసుకోవాలి. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. పశువులు తప్పిపోకుండా చెవిపోగు వేయించాలి. గాలికి ఊడి పడే వస్తువులు, మండే స్వభావం ఉన్న పదార్థాలను పాక చుట్టుపక్కల ఉంచకూడదు.

వర్షాలు పడినప్పుడు.. పశువులు ఒత్తిడితో బెదరకుండా చూడాలి. శుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలి. నలతగా ఉన్నా, జబ్బు పడినా వెంటనే పశువైద్యశాలకు తోలుకెళ్లాలి. దాణా, మేత పొదుపుగా వాడాలి. అన్ని పశువులను ఒకేచోట ఉంచరాదు. పశువు మృతి చెందితే దూరంగా గుంత తీసి పూడ్చాలి. జబ్బువాపు, గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.



సాధారణ స్థితి వచ్చాక.. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేదాకా పోషణపై శ్రద్ధ అవసరం. శుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలి. మురికి నీరు తాగకుండా జాగ్రత్త పడాలి. ముంపునకు గురైన పాక ఆరబెట్టాలి. వైద్య పరీక్షలు చేయించాలి. పశువులు, షెడ్డుకు జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పశువు మృతి చెందితే బీమా కోసం దరఖాస్తు చేయాలి.

దారి దాటాలంటే హడల్!

రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ప్రమాదాలు

గత నెల 15న పాత రాజీవ్‌నగర్‌కు చెందిన లింగమనేని ప్రభు కుమార్ తల్లి కృష్ణ కుమారితో పాటు గుణదలలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. రామవరప్పాడు రింగ్ నుంచి గుణదల రోడ్డు వైపునకు తిరుగుతుండగా బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన తల్లీ కుమారులు అక్కడికక్కడే మృతి చెందారు.

ఈ ఏడాది జూన్ 21న రామవరప్పాడుకు చెందిన మత్తి మురళీ కుమారుడు దుర్గ ప్రసాద్‌ను ద్విచక్ర వాహనంపై సిద్దార్థ మెడికల్ కళాశాల మైదానానికి క్రికెట్ కోచింగ్ తీసుకు వెళ్తున్నాడు. రామవరప్పాడు రింగ్ నుంచి గుణదల రోడ్డు వైపునకు తిరుగుతుండగా.. ఓ లారీ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రి కొడుకులు ఇద్దరు కింద పడిపోగా, కుమారుడిపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ప్రమాదాలతో ప్రజలు ప్రాణాలు హరిస్తూ రాకాసి జంక్షన్‌గా మారింది. వాహనదారులు దీన్ని దాటాలంటేనే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. దీని గుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

ప్రమాదానికి కారణాలేంటి..

గన్నవరం వైపు నుంచి బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ వద్ద ఆగకుండా వెళ్లేందుకు పోలీసు అధికారులు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ సిగ్నల్స్‌తో సంబంధం లేకుండా వెళ్లిపోవడంతో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందనేది పోలీసులు ఆలోచన. కానీ ఫ్రీ లెఫ్ట్‌ను తక్కువ వెడల్పుతో ఏర్పాటు చేశారు.



ఫ్రీ లెఫ్ట్ వెడల్పు తక్కువగా ఉండడంతో నేరుగానే బెంజ్ సర్కిల్ వైపు వెళ్తున్న భారీ వాహనాలు

దీంతో భారీ వాహనాలు దీని నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలతో మిగిలిన వాహనాలు కూడా ఫ్రీ లెఫ్ట్‌లో కాకుండా సాధారణ మార్గంలోనే వాహనాలు వెళ్తున్నాయి. గుణదల రోడ్డులోకి వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ వద్ద మీదుగా వెళ్తుంటారు. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలు, గుణదల వైపు వెళ్లే వాహనాలు ఒకేసారి వదలడంతో ఆ వాహనాల పక్కన నుంచి ద్విచక్ర వాహనాలు గుణదల రోడ్డులోకి తిరుగుతున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 8 మంది ఇదే తరహా ప్రమాదంలో ఈ జంక్షన్ వద్ద మృతి చెందారు. అయినప్పటికీ అధికారులు నివారణ చర్యలపై దృష్టి సారించలేదు.

ఇలా చేస్తే మేలు

- బెంజ్ సర్కిల్ వైపు వాహనాలు వెళ్లేందుకు రామవరప్పాడు రింగ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ మార్గం వెడల్పు పెంచాలి. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలు కచ్చితంగా ఫ్రీ లెఫ్ట్ నుంచే వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.
- సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని కేటాయించాలి. గుణదల వైపు వెళ్లే వాహనాలు మాత్రమే సాధారణ మార్గంలో వెళ్లేలా చూస్తే ఈ జంక్షన్ వద్ద ప్రమాదాలు దాదాపుగా నివారించవచ్చు.

చంద్రబాబు దార్శనికతతో డ్రోన్ హాక్‌థాన్‌లో రికార్డులు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు శివనాథ్(చిన్ని), సీఎం రమేష్, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, విజయకుమార్‌లకు చిత్రపటం ఇస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే డ్రోన్ హాక్‌థాన్‌లో ఐదు గిన్నిస్ రికార్డులు నమోదు అయ్యాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మను ఎంపీలు కేశినేని శివనాథ్, సీఎం రమేష్‌లతో కలిసి ఆయన బుధవారం దర్శించుకున్నారు. అనంతరం మంత్రి, ఎంపీలు మాట్లాడుతూ జగన్మాత దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రోన్ సమ్మిట్ విజయవంతం అయ్యిందన్నారు. అంతకముందు దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. వారి వెంట మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, యలమంచలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా దేశాభివృద్ధి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న భాజపా నాయకులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా దేశాన్ని మరింత అభివృద్ధి పథం దిశగా అంకిత, సేవా భావంతో పని చేయనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీ నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న కేంద్రమంత్రికి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, భాజపా సీనియర్ నేతలు సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వంద రోజుల్లో అనేక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. పేదలకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలు, ప్రపంచంలోని దేశాల మధ్య సయోధ్య కుదిర్చే విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

29 నుంచి వైద్య మిత్రల సమ్మె

గాంధీనగర్, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోరుతూ వైద్య మిత్రలు ఈ నెల 29వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారని ఏపీ గ్రామ, సచివాలయ ఏఎన్ఎం హెల్త్ సెక్రటరీస్ ఆదర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ వైద్య మిత్రలు 17ఏళ్లుగా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని కోరారు. అంగన్‌వాడీ సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చామని, ఇంత వరకు పరిష్కారం కాలేదన్నారు. మధ్యాహ్న భోజనం, ఆశా కార్మికుల సమస్యలు కూడా పరిష్కరించలేదన్నారు. ఆ రోజు జరిగే సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. ఇసుక అవకతవకలపై నవంబరు 11న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

బ్యారేజీ 40 గేట్ల మూసివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద బుధవారం వరద ప్రవాహం మరింత తగ్గు ముఖం పట్టింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 81,330 క్యూసెక్కుల నీరు రాగా, సాయంత్రం 6 గంటలకు 25,350 క్యూసెక్కులకు తగ్గింది. 30 గేట్లను అడుగు మేర ఎత్తారు. మిగతా 40 గేట్లు మూసివేశారు. సముద్రంలోకి 21,750, పంట కాల్వలకు 12,831 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పులిచింతల నుంచి 18,999, మునేరు (కీసర) నుంచి 5,989, పాలేరు నుంచి 362 క్యూసెక్కుల మేర వస్తోంది.

కాల్వలకు నీటి విడుదల పెంపు..

ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు నీటి విడుదలను పెంచారు. మొత్తం 12,831 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 7,822, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,009 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 4,188, ఏలూరు కాల్వకు 1,302, కేఈబీ కాల్వకు 1,102, బందరు కాల్వకు 1,300 క్యూసెక్కులు విడుదల చేశారు.

కేడీసీఏ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



ఏసీఏ అధ్యక్షుడు శివనాథ్‌తో కార్యవర్గ సభ్యులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా క్రికెట్ సంఘం (కేడీసీఏ) నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.వెంకట రత్నం బుధవారం ప్రకటించారు. కేడీసీఏలోని ఆరు పోస్టులకు నామినేషన్లు స్వీకరించారు. ఈ నెల 7న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ అర్హత పొందడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఆయన తెలిపారు. కేడీసీఏ నూతన అధ్యక్షుడిగా పొట్లూరి శ్రీనివాస్‌చౌదరి, ఉపాధ్యక్షుడిగా బండారు శ్రీనివాసరావు, కార్యదర్శిగా మేడసాని రవీంద్రచౌదరి, సంయుక్త కార్యదర్శిగా వెల్లమర్తి రజనీకాంత్, కోశాధికారిగా మొహమ్మద్ సాధిక్, కౌన్సిలర్‌గా పఠాన్ బాజీ షరీఫ్‌ఖాన్ ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు.... ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్‌ని నగరంలోని ఆయన కార్యాలయంలో కలిశారు. వారిని ఆయన అభినందించారు.

29న సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు


విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రమే అర్హులని చెప్పారు. ఆసక్తిగల ఉద్యోగులు ఆధార్‌కార్డు, గుర్తింపు కార్డు, హోదా, కార్యాలయ అధికారి ధ్రువీకరణతో 29న ఉదయం 8 గంటలకు ఐజీఎంసీ స్టేడియంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 98662 45746 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

దరఖాస్తుల గడువు 25 వరకు పొడిగింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు కొనసాగే శిక్షణ కోసం దరఖాస్తుల దాఖలు గడువును ఈ నెల 21 నుంచి 25 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అభ్యర్థులు http:///jnanabhumi.ap.gov.in (జ్ఞానభూమి) ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధికి విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కృష్ణారావు, రామకృష్ణారెడ్డి తదితరులు

పటమట, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళం అందించారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్ అందజేశారు. అసోసియేషన్‌లోని 3 వేల మందికిపైగా సభ్యులు తమ ఒకటిన్నర రోజుల పింఛను సీఎం సహాయనిధికి అందజేశారని చంద్రబాబుకు వివరించారు. సీఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు. సంఘం సలహాదారు ఎస్.వి.కృష్ణారావు, అధ్యక్షుడు ఎం.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.ఆర్.కె.రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ ఎన్నికలు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం జరిగాయి. ఎన్నికల్లో విజయవాడ, మచిలీపట్నం టీచింగ్, డెంటల్, ఆయుర్వేద, ఈఎస్ఐ, పీహెచ్‌సీల్లో శాశ్వత నర్సులుగా విధులు నిర్వహిస్తున్న వారు పాల్గొన్నారు. నర్సుల సంఘం అధ్యక్షురాలిగా షేక్ షమీవుల్ బేగం, ఉపాధ్యక్షురాలిగా ఇందిరా దేవి, కార్యదర్శిగా వేల్పుల జ్యోతి, కోశాధికారిగా కె.శివలీల.. మరో ఐదు మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ప్రతి మూడేళ్లకోసారి జరుగుతాయని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎ.ధర్మారావు తెలిపారు.

పార్కుల్లో వాకింగ్ ట్రాకులు పెంచాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: పట్టణ, నగర ప్రాంతాల్లోని ప్రజల సౌకర్యార్థం పార్కుల్లో నడక దారులను పెంచాలని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్(ఏపీసీసీఐఎఫ్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబుకు ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉదయం పూట నడకకు సరైన ప్రదేశాలు లేకపోవడంతో ఎక్కువ మంది రోడ్లపైకి వస్తున్నారని.. దీంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు కుక్కల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. విద్యాసంస్థల ఆట స్థలాలలో ప్రజలకు ఉదయం, సాయంత్రం నడక, వ్యాయామాలు చేసుకునేందుకు కొంత సమయం వరకు వీలు కల్పించేలా ప్రభుత్వం జీవో జారీచేయాలని కోరారు.